ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
మంగళవారం 24 సెప్టెంబరు 2024



హిందూపురం పట్టణ వ్యూ

ఆర్‌బీఐ కాలింగ్..!

సైబర్ నేరగాళ్ల కొత్త ప్లాన్

- ఫోన్‌కు కాల్ వస్తుంది..
- ఆర్‌బీఐ నుంచి చేస్తున్నామంటారు..
- ఏప్రాంతంలో ఉంటున్నారు..
- తదితర వివరాలు కూడా చెబుతారు..
- హవాలా డబ్బు బదిలీ చేశారంటారు..
- క్రెడిట్ కార్డు రుణం చెల్లించలేదంటారు..
- కేసు నమోదైందంటారు..
- పోలీసులతో మాట్లాడమంటారు..
- వీడియో కాల్ చేస్తారు..
- పోలీసు స్టేషన్ సెటప్ నుంచి..
- యూనిఫారంలో ఉన్న అధికారి మాట్లాడతాడు..
- అది పోలీసు స్టేషనేననీ..
- అతడు పోలీసు అధికారేనని నమ్మిస్తారు..
- స్వరం పెంచి.. బెదిరిస్తారు..
- మీదో.. కాదో.. పరిశీలిస్తామంటారు..
- ఆధార్, పాన్ నంబర్లు..
- బ్యాంకు వివరాలు ఇవ్వాలంటారు..
- భయపడి చెబితే..
- నిముషాల్లో బ్యాంకు ఖాతా ఖాళీనే..
- ఇలా.. ఉద్యోగులు, వ్యాపారులే లక్ష్యంగా..
- రోజూ సైబర్ నేరగాళ్ల నుంచి కాల్స్ వస్తున్నాయి..
- దీంతో ఆ వర్గాలు బెంబేలెత్తుతున్నాయి.

ఉద్యోగులు, వ్యాపారులే టార్గెట్

ఆర్‌బీఐ నుంచి అంటూ ఫోన్

క్రెడిట్ కార్డు అప్పు తీర్చాలని హుకుం

పోలీసు వారెంట్ ఉందంటూ బెదిరింపులు

ముందస్తు స్టేషన్ సెటప్‌తో బెంబేలు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 23: సైబర్ నేరగాళ్ల రోజుకో కొత్త దారి వెతుక్కుంటున్నారు. భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) నుంచి కాల్ చేస్తున్నామని మాటకలుపుతున్నారు. మీరు ఇటీవల క్రెడిట్ కార్డు నుంచి డబ్బు వాడుకుని, దానిని తిరిగి చెల్లించలేదనీ, ఇప్పుడు అది మోపైందని బెదిరిస్తున్నారు. ముందుగా వారు సేకరించి పెట్టుకున్న సమాచారంతో 'మీరు ఫలానా ప్రాంతానికి చెందిన వారని చెబుతున్నారు. కేసు నమోదైందనీ, ఆ పరిధి పోలీసులతో మాట్లాడాలంటున్నారు. మరింత సమాచారం కోసం తమ అధికారికి కాల్ కలుపుతామని నమ్మబలుకుతున్నారు. ముఠాలోని మరొకరికి కాల్ కలుపుతారు. వారు మరిన్ని వివరాలు సేకరించే పనిలో నిమగ్నమవుతున్నారు. ఇలా కాల్‌ను కొనసాగిస్తూ ఫోన్‌లోని డేటా కొట్టేస్తారు. వీడియో కాల్ చేస్తామంటూ ముందస్తుగా సెటప్ చేసుకున్న నకిలీ పోలీసు స్టేషన్ నుంచి కాల్ వస్తుంది. అది చూసి నిజమేనని బాధితులు భయపడిపోతున్నారు. తనపై కేసు నమోదైందేమోనని సందిగ్ధంలో పడిపోతున్నారు. మొదట భయపెట్టి.. ఆ తరువాత ఆధార్, పాన్ నంబర్లు, బ్యాంకు సమాచారం సేకరిస్తున్నారు. ఇంతకీ మీరేనా, పొరబాటున వేరే వారు క్రెడిట్ కార్డు వాడుకున్నారా కనుక్కునేందుకు బ్యాంకు సమాచారం కావాలని అడుగుతారు. దీంతో వారు అడిగిన వివరాలు ఇచ్చేస్తున్నారు. ఇంకేముంది కాసేపటికి బ్యాంకు ఖాతాలోని సొమ్ము ఖాళీ అవుతోంది. ఇలాంటి మోసాలు పురం ప్రాంతంలో రోజూ ఏదో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. ప్రతి ఊరిలో కనీసం 10 మందికి రోజూ ఇలాంటి కాల్స్ వస్తున్నాయి.

ఓ ఉపాధ్యాయుడికి మూడు రోజుల క్రితం ఆర్‌బీఐ నుంచి కాల్ చేస్తున్నామని 8646841012 నంబరు నుంచి ఫోన్ వచ్చింది. మొదట ఆయన ఆర్‌బీఐ కదా అని మాట్లాడారు. తరువాత క్రెడిట్ కార్డు నుంచి రూ.1.80 లక్షలు లోన్ తీసుకున్నారనీ, తిరిగి చెల్లించకపోవడంతో కేసు నమోదైందని భయపెట్టారు. ఆయన మాట్లాడుతూ.. తన క్రెడిట్ కార్డు రూ.90 వేల వరకే లిమిట్ ఉందనీ, తాను అంతకుమించి ఎలా తీసుకుంటానని బదులిచ్చాడు. దీంతో లోన్ తీసుకుని, డబ్బు కట్టకపోవడంతో కేసు నమోదు చేశామన్నారు. 'మీ పేరున మరో క్రెడిట్ కార్డు ఉందేమో పరిశీలిస్తామన్నా'రు. వీడియో కాల్ చేస్తామన్నారు. 9073719058 నంబరు నుంచి వీడియోకాల్ వచ్చింది. అది అచ్చం పోలీసు స్టేషన్ సెట్టింగ్‌లా ఉంది. మొదట పోలీసు యూనిఫారంలో ఉన్న నకిలీ అధికారి నెమ్మదిగా మాట్లాడాడు. తరువాత స్వరం పెంచాడు. ఆధార్ కార్డు పంపాలనీ, చెక్ చేస్తామని బెదిరించాడు. దీంతో ఆధార్ పంపాడు. మరి కొంతసేపటికి బ్యాంకు వివరాలు అడగటంతో సదరు ఉపాధ్యాయుడు తేరుకున్నాడు. బ్యాంకుకెళ్లి, అక్కడి సిబ్బందితో మాట్లాడతాననీ, తన పరిధిలోని పోలీసులతో మాట్లాడతానన్నాడు. బ్యాంకు వివరాలు ఇచ్చేదిలేదనీ, ఏమైనా చేసుకోండంటూ ఫోన్ పెట్టేశాడు. తరువాత తన బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేసి, ఫోన్ లింక్‌ను మార్చేశాడు. దీంతో ఆయన తన డబ్బును కాపాడుకున్నాడు.

ఓ ఉపాధ్యాయురాలికి ఆర్‌బీఐ నుంచి ఫోన్ చేస్తున్నామని కాల్ వచ్చింది. పెద్దఎత్తున మనీ ల్యాండరింగ్ చేశారనీ, ఆదాయపు పన్ను శాఖ నుంచి సమాచారం అందిందని బెదిరించారు. దీంతో భయపడిపోయిన ఆమె కాల్ కట్ చేసి, భర్తకి సమాచారం అందించారు. అది ఫేక్ కాల్ అనీ, సామాన్యులతో ఆర్‌బీఐ సిబ్బంది ఎందుకు మాట్లాడతారని చెప్పాడు. దీంతో అప్రమత్తమయ్యారు. ఇలా రోజూ ఉద్యోగులు, వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు కొత్త దోపిడీకి తెరలేపారు. వారికి తమ ఫోన్ నంబర్లు ఎలా తెలుస్తున్నాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

స్పామ్‌కాల్స్‌ను బ్లాక్ చేయండి

అనవసరంగా వచ్చే, అనుమానిత ఫోన్ కాల్స్‌ను బ్లాక్ చేయాలి. నేరుగా బ్యాంకుకు వెళ్లి సమాచారం తెలుసుకోవాలి. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని, రుణం ఇస్తామనీ, క్రెడిట్ కార్డు మంజూరు చేస్తామనీ తదితర ఆశలు చూపి, కుచ్చుటోపీ పెడుతున్నారు. అనుమానం ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయండి.

-రాజగోపాల్ నాయుడు, సీఐ, వన్‌టౌన్



సకాలంలో ఫిర్యాదులు పరిష్కరించండి

కలెక్టర్ ఆదేశాలు



బాధితుడితో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తి, సెప్టెంబరు 23: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పారదర్శకంగా సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ చేతన్.. అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి కలెక్టర్ ఫిర్యాదులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 309 ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధ్యులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం గృహనిర్మాణాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చే మార్చి నాటికి జిల్లాలో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఆ దిశగా ప్రణాళికతో చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 28న ప్రత్యేకంగా గృహ నిర్మాణాలపై 'గృహం.. మన గౌరవం' కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో నిర్వహించి, లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా లేపాక్షిలో నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాల పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్వో కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ పాల్గొన్నారు.

డీపీఓలో 76 ఫిర్యాదులు

పుట్టపర్తిరూరల్: జిల్లా కేంద్రంలోని డీపీలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 76 ఫిర్యాదులు అందాయి. వాటికి ఎస్పీ రత్న స్వీకరించారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం, ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 23: జిల్లాలో మద్యం, ఇసుక అక్రమ రవాణా, అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవా రం ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి, పేకాటను రూపుమాపే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లా సరిహద్దులో నిఘా పెంచుతామన్నారు.

సైబర్ నేరాలు, గంజాయి నివారణపై ఇప్పటికే హిందూపురం, ధర్మవరం ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. ధర్మవరం, గోరంట్ల నల్లమాడ, అమడగూరు ప్రాంతాల్లో దాడులుచేసి, పెద్దఎత్తున అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లాలో అవసరమైన చోట్ల ట్రాఫిక్ పోలీసు స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. సమావేశంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



గొడవపడుతున్న బీజేపీ, వైసీపీ నాయకులు

ధర్మవరంలో ఉద్రిక్తత

బీజేపీ, వైసీపీ వర్గీయుల గొడవ

- సబ్‌జైలు ఎదుట పరస్పర దాడులు
- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి కారు అద్దం ధ్వంసం
- ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు



సబ్‌జైలు వద్ద గుమికూడిన జనం

ధర్మవరం, సెప్టెంబరు 23: పట్టణంలో సోమవారం వైసీపీ, బీజేపీ వర్గాలు ఘర్షణ పడడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. స్థానిక సబ్‌జైలులో ఉన్న వైసీపీ కార్యకర్తలను పరామర్శించడానికి ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వచ్చారు. ఆయన ఉన్న వాహనం సబ్‌జైలులోకి వెళ్లిపోయింది. వెనకాలే ఆయన అనుచరులు మరో రెండు వాహనాల్లో వస్తున్నారు. అందులో ఇన్నోవా వాహనం సబ్‌జైలు వైపు మలుపు తీసుకుంటోంది. వెనుక బీజేపీ నాయకుల వాహనాలు వస్తున్నాయి. కేతిరెడ్డి వాహనాన్ని ముందుకెళ్లాలని బీజేపీ నాయకులు సూచించారు. కేతిరెడ్డి వాహన డ్రైవర్ రామాంజి నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతోపాటు వారిపై దురుసుగా ప్రవర్తించాడు. దీంతో బీజేపీ నాయకులు ఆగ్రహానికి లోనయ్యారు. రోడ్డుకు అడ్డంగా వాహనాన్ని ఉంచి తమపైనే తిరగబడతావా అంటూ నిలదీశారు. కాసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పరస్పరం దాడులు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పెద్దఎత్తున అక్కడికి చేరుకోవడంతో తోపులాట జరిగింది. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే కారు డ్రైవర్ రామాంజిపై దాడి చేశారు. కారు అద్దాన్ని పగులగొట్టారు. కేతిరెడ్డి డ్రైవర్ కారును అతి వేగంగా నడుపుకుంటూ బీజేపీ కార్యకర్త ప్రతాప్‌రెడ్డిని ఢీకొట్టి ముందుకెళ్లాడు. అక్కడే ఉన్న మరి కొంతమంది వైసీపీ కార్యకర్తలు కవ్వింపులకు దిగగా.. వారిపై కూటమి శ్రేణులు దాడి చేశాయి. దీంతో ఒక్కసారిగా సబ్‌జైలు నుంచి కాలేజీ సర్కిల్ వరకు భారీగా జనం గుమికూడారు. ఏఎస్పీ శ్రీనివాసులు, సీఐ రెడ్డెప్ప.. సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి, పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా కార్యకర్తలను పరామర్శించడానికి సబ్‌జైలు లోపలికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని బయట పరిస్థితి సద్దుమణిగే వరకు పోలీసులు లోపలే ఉంచారు. విషయం తెలుసుకున్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, టీడీపీ నాయకుడు కమతం కాటమయ్య, చింతలపల్లి మహేశ్‌చౌదరి, ఫణికుమార్, సంధా రాఘవ, నాగూర్ హుస్సేన్, బీజేపీ నాయకులు హరీశ్, జోలా రాజారెడ్డి తదితరులు సబ్‌జైలు వద్దకు చేరుకున్నారు. వారిని ముందుజాగ్రత్త చర్యగా వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. గొడవ కారణంగా రెండు గంటలపాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పుట్టపర్తి ఏఎస్పీ శ్రీనివాసులు ధర్మవరం చేరుకుని, పరిస్థితిని సమీక్షించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నాలుగు గంటలపాటు సబ్‌జైలులోనే కేతిరెడ్డి

బీజేపీ, వైసీపీ నాయకుల మధ్య గొడవ మధ్యాహ్నం 3గంటలకు మొదలైంది. అప్పటి నుంచి సబ్‌జైలులోనే మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి ఉండిపోయారు. బయట ఉద్రిక్త పరిస్థితులను గమనించిన పోలీసులు ఆయనను బయటకు రాకుండా జాగ్రత్తపడ్డారు. పరిస్థితి సద్దుమునిగాక కేతిరెడ్డిని పోలీసులు ఇంటికి పంపించారు. కేతిరెడ్డి స్థానికంగా ఉంటే శాంతిభద్రతలు లోపిస్తాయనీ, వెంటనే పట్టణ బహిష్కరణ చేయాలని బీజేపీ, టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఘర్షణపై కేతిరెడ్డి తన నివాసంలో మాట్లాడుతూ.. కూటమి నేతలు అనవసర రాద్ధాంతం చేశారన్నారు. ప్రజలను భయభ్రాంతులకు లోను చేశారన్నారు.

ఇదీ.. ధర్మవరం కేటురెడ్డి నిజస్వరూపం

మంత్రి సత్యకుమార్

పట్టణంలో కేటురెడ్డి నిజస్వరూపం బయటపడిందని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ఉద్దేశించి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సోమవారం ట్వీట్ చేశారు. పట్టణంలోని సబ్‌జైలు ముందు సోమవారం కేతిరెడ్డి వాహన డ్రైవర్ దురుసుగా ప్రవర్తించడం, బీజేపీ శ్రేణులు గొడవకు దిగడంపై మంత్రి ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. ఓటమితో కేటురెడ్డి మైండ్‌బ్లాక్ అయిందన్నారు. కేతిరెడ్డి డ్రైవర్ ప్రజలపైకి కారును నడిపి ఢీకొట్టుకుంటూ వెళ్లడం అందరూ గమనిస్తున్నారన్నారు. గతంలో చేసిన తప్పులకు ప్రజలు గుణపాఠం చెప్పినా కేతిరెడ్డికి బుద్ధిరాలేదని ట్విట్టర్‌లో మండిపడ్డారు. జైలు జీవితం గడపాలనే కోరిక ఉంటే త్వరలోనే తీరుస్తామని కేతిరెడ్డికి మంత్రి చురకలు అంటించారు. ధర్మవరం ప్రజలకు చిన్న కీడు చేసినా సహించమనీ, పర్యవసనాలు తీవ్రంగా ఉంటాయన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు.

బదిలీలలు..!

- సిఫార్సులకే ప్రాధాన్యం
- రెవెన్యూలో మాయాజాలం
- డిప్యూటీలనే తహసీల్దార్లుగా కొనసాగించే ఎత్తుగడ
- ఎక్సైజ్‌లో జోరుగా పైరవీలు
- సీఐ, ఎస్ఐ పోస్టింగులకు బేరాలు



పుట్టపర్తి, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో ఎన్నెన్నో లీలలు. ఒక్కో శాఖలో ఒక్కోలా వ్యవహారాలు సాగుతున్నాయన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. రాజకీయ సిఫార్సుల హవా కొనసాగిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కీలకమైన రెవెన్యూ శాఖ బదిలీల్లో సిఫార్సులకే పెద్దపీట వేశారని తెలుస్తోంది. కొన్ని శాఖల్లో పైరవీలు, బేరాలు జోరుగా సాగాయి. కొన్ని శాఖల్లో బదిలీలు పూర్తికాగా, మరికొన్నింటిలో తుది దశకు చేరుకున్నాయి. గత ఐదేళ్లు వైసీపీతో అంటకాగిన, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని సైతం అందలం ఎక్కించారు. సిఫార్సు లేఖలు ఇవ్వనివారిని దూరంగా విసిరేశారు. ఏళ్ల తరబడి ఒకేచోట పాతుకుపోయిన వారిని ఏమాత్రం కదిలించలేదు. ఒకవేళ కదిలించినా పక్క మండలం, గ్రామలకు అదీ వారు కోరిన చోటుకి బదిలీ చేశారు. రెవెన్యూ శాఖలో బదిలీలు అస్తవ్యస్తంగా సాగాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పారదర్శకతకు పాతరేశారని తెలుస్తోంది. నెల క్రితం తహసీల్దార్ల బదిలీలు, తాజాగా డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్వోల ట్రాన్స్‌ఫర్లలో పలువురు పలుకుబడి ఉపయోగించారని తెలుస్తోంది. బదిలీకి దరఖాస్తు చేయకపోయినా.. స్థానచలనం కల్పించారని సమాచారం. దరఖాస్తు చేయకపోయినా బదిలీ ఉత్తర్వులు ఇవ్వడంతో అవాక్కయ్యారు. ఇప్పటికే జిల్లాలో కొలువుదీరిన తహసీల్దార్లలో చాలావరకు నచ్చినచోట పోస్టింగ్ కోసం పైరవీలు చేసుకున్న సంగతి తెలిసిందే. తాజా బదిలీల్లో పలు మండలాల్లో డిప్యూటీ తహసీల్దార్లతోపాటు ఆర్ఐ, వీఆర్వోలు కోరుకున్న చోటుకు వెళ్లడానికి సర్వశక్తులు ఒడ్డారు. వీఆర్వోల నుంచి డిప్యూటీ తహసీల్దార్లదాకా అనుకూలమైన అధికారులను తమ నియోజకవర్గానికి తెచ్చుకునేందుకు సిఫార్సు లేఖలతో అధికార పార్టీ నేతలు ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలో బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టామని అధికార వర్గాలు చెబుతున్నా.. ప్రజాప్రతినిధుల సిఫార్సులు, ఒత్తిళ్లకు తలొగ్గారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

డీటీలనే కొనసాగించేందుకు పావులు

ఎన్నికల ముందు జిల్లాకు వచ్చిన తహసీల్దార్లు నెల క్రితం బదిలీల్లో సొంత ప్రాంతాలకు వెళ్లిపోయారు. జిల్లాలో 17 తహసీల్దార్ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ తహసీల్దార్లతో నెట్టుకొస్తున్నారు. ఆయాస్థానాల్లో తమకు అనుకూలమైన డిప్యూటీ తహసీల్దార్లను నియమించుకునేందుకు రాజకీయ నేతలు.. సిఫార్సు అస్త్రాన్ని ప్రయోగించారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ తహసీల్దార్ బదిలీలు మొత్తంగా సిఫార్సు లేఖలపైనే జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరికే తహసీల్దార్ బాధ్యతలు అప్పగించి, కొనసాగించే అవకాశం ఉంది. ఆర్ఐ, వీఆర్వోలు సైతం ప్రజాప్రతినిధుల సిఫార్సులతో కోరుకున్న చోటుకి బదిలీ చేయించుకున్నారనే విమర్శలున్నాయి. కొందరు వీఆర్వోలు ఏళ్లుగా ఒకేచోట కొనసాగుతున్నారు. గత వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతలతో అంటకాగారు. ఐదేళ్లపాటు తమ స్థానాలను పదిలపరచుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నాయకులను ప్రసన్నం చేసుకుని, అక్కడే కొనసాగుతున్నారు. సోమవారం రాత్రికి వీఆర్వోల బదిలీల జాబితా వెల్లడయ్యే అవకాశం ఉంది.

ఎక్సైజ్‌లో బేరాలు

మొన్నటిదాకా ఎక్సైజ్ శాఖది ఇక దారి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)ది మరోదారి. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఈ రెండింటి మధ్య ఉన్న గీత చెరిగిపోయింది. సెబ్‌ను ఎక్సైజ్ శాఖలో విలీనం చేసింది. దీంతో ఎక్సైజ్ శాఖ పోస్టులకు డిమాండ్ పెరిగింది. ఆయా పోస్టులకు పైరవీలు జోరందుకున్నాయి. జిల్లాలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది తమ స్థానాలను పదిలం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కొందరు కూటమి ప్రజాప్రతినిధులు, నేతల చుట్టూ చక్కర్లు కొట్టి సిఫార్సు లేఖలు చేజిక్కించుకున్నారు. మరి కొందరు జిల్లాకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బదిలీలకు ఈనెల 30దాకా గడువు ఉన్న నేపథ్యంలో ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఒక అసిస్టెంట్ సూపరింటెండెంట్‌తోపాటు 8 ఎక్సైజ్ పోలీసు స్టేషన్లు, చెక్‌పోస్టుల పరిధిలో 29 దాకా సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లతోపాటు సిబ్బందిని బదిలీ ద్వారా నియమించాల్సి ఉంది. తెలంగాణకు చెందిన చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న శ్రీనివాసులు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా, గతంలో సీఐగా పనిచేసి ఎన్నికల ముందు బదిలీపై వెళ్లిన నరసింహులు ఉద్యోగోన్నతిపై ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. నేడో.. రేపో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. సీఐ, ఎస్ఐ పోస్టులకు గట్టిపోటీ నెలకొంది. ఏదో ఒక స్టేషన్ ఇస్తే చాలు అన్నవిధంగా పైరవీలు సాగుతున్నాయి. నెలాఖరుదాకా గడువు ఉన్న నేపథ్యంలో జిల్లాకు రావడానికి కొందరు ప్రయత్నాలు చేస్తుండగా.. మరికొందరు ప్రస్తుత స్థానాలను కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇలా ఎక్సైజ్ శాఖలో సిఫార్సుల బేరం దూమారం రేపుతోంది.

ఆర్‌అండ్‌బీలో బదిలీలు

అనంతపురం సిటీ, సెప్టెంబరు 23: ఉమ్మడి జిల్లాలోని రోడ్లు, భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ) పరిధిలో పనిచేస్తున్న పలువురు ఈఈలు, డీఈఈలను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆమేరకు ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఉత్తర్వులు జారీ చేసింది.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జె. ప్రసాద్‌రెడ్డి	ఈఈ (అనంతపురం)	కళ్యాణదుర్గం
వి. రాజగోపాల్	ఈఈ(కళ్యాణదుర్గం)	అనంతపురం
	డీఈఈల బదిలీలు	
బి. నాగరాజు	పెనుకొండ	ఎన్‌హెచ్ కడప
వి. గిడ్డయ్య	(ఏటీపీ, ఎన్‌హెచ్)	ఎన్‌హెచ్ వి.కోట
రామచంద్రారెడ్డి	(తాడిపత్రి ఎన్‌హెచ్)	ఎన్‌హెచ్ ఈఈ, ఏటీపీ
ఎం. శైలజ	కదిరి	తిరుపతి రూరల్
జె. జగదీష్‌గుప్తా	ఎన్‌హెచ్ వి. కోట.	మడకశిర
ఎం. వెంకట్రామిరెడ్డి	ఈఈ ఎన్‌హెచ్ ఏటీపీ	పెనుకొండ
పి. ధనలక్ష్మి	ఈఈ. పీఏ కడప	ఎన్‌హెచ్ తాడిపత్రి
ఎన్. కంబగిరి	మదనపల్లె	కదిరి

హౌసింగ్‌లో బదిలీలు

అనంతపురం సిటీ, సెప్టెంబరు 23: జిల్లా గృహ నిర్మాణశాఖలో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లా హౌసింగ్ పీడీగా శ్రీ సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న కె. వెంకటనారాయణను నియమించా రు. దీంతో ఇప్పటి వరకు ఇన్‌చార్జి పీడీగా పనిచేస్తున్న శైలజ తన పాత స్థానమైన అనంతపురం ఈఈగా కొనసాగనున్నారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
బి. కృష్ణారావు	అనంతపురం అర్బన్	ధర్మవరం అర్బన్
బి. శివకుమార్‌నాయక్	శ్రీ సత్యసాయి	మడకశిర
పి. శ్రీమన్నారాయణ	శింగనమల	రాప్తాడు
వై. లక్ష్మీనారాయణమ్మ	తాడిపత్రి	అనంతపురంపీడీ ఆఫీస్
ఎండీ ఖాశీం(మేనేజర్)	అనంతపురం	అనంతపురం రిటైన్

పీఆర్‌లో బదిలీలు

అనంతపురం సిటీ, సెప్టెంబరు 23: ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్ శాఖలో పనిచేస్తున్న 11మంది డీఈఈలు, 44మంది జేఈఈ(ఏఈ,ఏఈఈ)లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదివారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. డీఈఈల బదిలీలు ఇలా..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
బి. శ్రీనివాసమూర్తి	పీఆర్ఐ-2 అనంతపురం	పీఐయూ, పుట్టపర్తి
టి. రాజేంద్రప్రసాద్	ఎస్‌ఈ పీఏ (ఏటీపీ)	తాడిపత్రి, పీఆర్ఐ
మహమ్మద్ రసూల్	పీఐయూ, అనంతపురం	పీఆర్ఐ, ఉరవకొండ
బి. రాజన్న	కళ్యాణదుర్గం, పీఆర్ఐ	పీఐయూ, మడకశిర
భరత్‌ప్రకాష్‌రెడ్డి	క్యూసీ-1, అనంతపురం	ఈఈ పీఏ పీఐయూ
డి. రామ్మోహన్‌రెడ్డి	పీఆర్ఐ, రాయదుర్గం	క్యూసీ, కడప
జె. మల్లికార్జున	పీఐయూ, మడకశిర	పీఆర్ఐ, హిందూపురం
లోకన్న	పీఆర్ఐ, ధర్మవరం	క్యూసీ-1, ఏటీపీ
రవీంద్రకుమార్	ఈఈ పీఏ, పీఐయూ	క్యూసీ-2,ఏటీపీ
రాజేశ్వరరెడ్డి	క్యూసీ-1, అనంతపురం	పీఐయూ, తాడిపత్రి
బి. చంద్రకుమార్	పీఐయూ, పెనుకొండ	ఎస్‌ఈ, పీఏ,(ఏటీపీ)

31 మంది ఈఓఆర్డీల బదిలీ

అనంతపురం న్యూటౌన్: ఉమ్మడి జిల్లాలో 31 మంది ఈఓఆర్డీలను బదిలీ చేస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జిలాని బాషా	తాడిపత్రి	పుట్లూరు
కమలాబాయ్	పెద్దపప్పూరు	రామగిరి
ఆనంద్‌ప్రసాద్	పుట్లూరు	రాప్తాడు
గూడెన్న	కణేకల్లు	కంబదూరు
హరికృష్ణ బాలాజీ	కళ్యాణదుర్గం	కుందుర్పి
విజయ్‌శేఖర్‌నాయుడు	యల్లనూరు	తాడిమర్రి
వెంకటలక్ష్మమ్మ	గార్లదిన్నె	శింగనమల
శివన్న	లేపాక్షి	గోరంట్ల
నట్రాజ్	హిందూపురం	కొత్తచెరువు
శకుంతల	తలుపుల	నల్లచెరువు
రాధాకృష్ణ	రామగిరి	కూడేరు
అశోక్‌కుమార్‌రెడ్డి	పుట్టపర్తి	బుక్కపట్నం
దివాకర్	బత్తలపల్లి	ముదిగుబ్బ
కేశవరెడ్డి	రొద్దం	ఓడీ చెరువు
చంద్రమౌళి	ఉరవకొండ	కణేకల్లు
సదాశివ	వజ్రకరూరు	బీకే సముద్రం
వెంకటేష్	యాడికి	తాడిపత్రి
వెంకటనాయుడు	బ్రహ్మసముద్రం	అనంతపురం రూరల్
సురేష్‌బాబు	గుమ్మఘట్ట	పెద్దపప్పూరు
మురళీకృష్ణ	శింగనమల	రాయదుర్గం
నరసింహారెడ్డి	రాప్తాడు	పెద్దవడుగూరు
రంగనాయకులు	రాయదుర్గం	కళ్యాణదుర్గం
నాగభూషణం	డి.హీరేహాళ్	గుంతకల్లు
క్రిష్ణప్ప	రొళ్ల	బత్తలపల్లి
రాజశేఖర్	ఓడీ చెరువు	తనకల్లు
ఇంద్రబాల	బుక్కపట్నం	పుట్టపర్తి
రాజేంద్రకృష్ణకుమార్	ముదిగుబ్బ	పామిడి
లక్ష్మీనరసమ్మ	కూడేరు	సోమందేపల్లి
మాధవి	అనంతపురం రూరల్	బ్రహ్మసముద్రం
కమ్మక్క	తాడిమర్రి	ఆత్మకూరు
శశికళ	పామిడి	యల్లనూరు

25 మంది గ్రేడ్-1 సెక్రటరీల బదిలీ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 23: జిల్లాలో 25 మంది గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులను, 76 మంది గ్రేడ్-3 కార్యదర్శులు, 243 గ్రేడ్-4 కార్యదర్శులను బదిలీ చేస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేడ్-1 కార్యదర్శుల వివరాలు ఇలా..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
భాస్కర్	అమరాపురం	కోడూరు
మహేశ్వరరెడ్డి	తాటిచెర్ల	కల్లూరు
ప్రేమ్‌కుమార్	ఉప్పరపల్లి	రాప్తాడు
ముత్యాలరెడ్డి	అనంతపురం రూరల్	బత్తలపల్లి
అశోక్‌బాబు	నారాయణపురం	ఆకుతోటపల్లి
మహమ్మద్‌రఫీ	ఆకుతోటపల్లి	రాచానపల్లి
సాదిక్‌వలి	బీకేఎస్	చీకదిరేకొండ
వెంకటేశ్వరప్రసాద్	బుక్కపట్నం	కొనకొండ్ల
శ్యామల	సీకేపల్లి	నార్పల
నారాయణస్వామి	కోడూరు	సీకే పల్లి
రవిచంద్ర	గార్లదిన్నె	తాటిచెర్ల
శ్రీనివాసరెడ్డి	కల్లూరు	సోమందేపల్లి
ప్రవీణ్‌బాబు	కదిరికొండ	ఏ. నారాయణపురం
గోపాల్	కొత్తచెరువు	పామిడి
అశ్వత్థమనాయుడు	నార్పల	యాడికి
సుధాకర్	కొండకమర్ల	అమరాపురం
చంద్రశేఖర్	పామిడి	గార్లదిన్నె
నారాయణ	కొడిగెనహళ్లి	పరిగి
సాదిక్‌వలి	పరిగి	బుక్కపట్నం
పెద్ద శ్రీనివాసులు	రాప్తాడు	బీకేఎస్
అబ్దుల్ మునాఫ్	తలుపుల	కాళసముద్రం
శ్రీధర్‌రావు	వజ్రకరూరు	అనంతపురం రూరల్
బాబాఫకృద్దీన్	పోలికి	ఉప్పరపల్లి
ఎర్రిస్వామి	యాడికి	పోలికి
బాబురావు	గోరంట్ల	రొళ్ల

ఒక హత్య.. రెండు జీవితకాలాల శిక్ష..!

- దెయ్యం శివారెడ్డి హత్యకేసులో అరుదైన తీర్పు
- ఏడుగురికి కఠిన శిక్షలు విధించిన సెషన్స్ కోర్టు
- శిక్షపడినవారిలో ఐదుగురు అన్నదమ్ములు
- ఇద్దరు మైనర్లపై జువైనల్ కోర్టులో కేసు పెండింగ్


ముద్దాయిలను జైలుకు తరలిస్తున్న పోలీసులు


కోర్టు ఆవరణలో విషణ్ణ వదనంలో కుటుంబ సభ్యులు


పోలీసు వ్యాన్‌లో జైలుకు తరలుతున్నవారి చేతులు పట్టుకుని ఏడుస్తున్న కుటుంబ సభ్యులు


కోర్టు ఆవరణలో కుటుంబ సభ్యుల రోదనలు


సొమ్మసిల్లిన మహిళలు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 23: హత్య కేసు ముద్దాయిలు ఏడుగురికి జిల్లా సెషన్స్ కోర్టు రెండు జీవితకాల శిక్ష విధించింది. ఒక్కొక్కరికి రూ.30 వేల జరిమానా విధించింది. ఈ మేరకు జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సోమవారం తీర్పు వెలువరించారు. శిక్ష పడిన వారిలో ఐదుగురు అన్నదమ్ములు. వీరందరి పైనా రౌడీషీట్ ఉంది. ముద్దాయిలలో సాకే బాలకృష్ణ, సాకే రమేష్‌పై నాలుగు హత్య కేసులు, నాలుగు అత్యాచారం కేసులు, బాంబుల కేసులు ఉన్నాయి. మరో ముద్దాయి సాకే అశోక్ పోక్సో కేసులో నిందితుడు. అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన దెయ్యం శివారెడ్డిని వీరు ఏడుగురు హత్య చేసినట్లు నేరం రుజువైంది.

ఇలా మొదలైంది...

కందుకూరు గ్రామానికి చెందిన దెయ్యం శివారెడ్డి వ్యవసాయం చేసేవాడు. దీంతో పాటు గ్రామంలో శ్రీమోక్షన్ ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ నడిపేవాడు. వైసీపీ తరఫున గతంలో వార్డు మెంబరుగా గెలిచాడు. 2017 అక్టోబరు 10న కందుకూరులో పీర్ల పండుగ జరిగింది. గ్రామానికి చెందిన బోయ సాకే బాలకృష్ణ, అతని కుటుంబ సభ్యులు అలాయ్ తొక్కుతున్నారు. అదే సమయంలో శివారెడ్డి నీటి సరఫరా నిమిత్తం ట్యాంకరును ఆటోను తీసుకుని బయలుదేరాడు. బాలకృష్ణ, అతని తమ్ముళ్లు దారి ఇవ్వకుండా శివారెడ్డిని అడ్డుకుని గొడవకు దిగారు. ఆ గొడవలో శివారెడ్డికి, అతని తమ్ముడు నరసింహారెడ్డికి, బాలకృష్ణకు గాయాలయ్యాయి. గొడవ సమయంలో బాలకృష్ణ పంచ ఊడిపోయింది. డ్రాయర్ లేని కారణంగా గ్రామంలో అవమానం జరిగినట్లు ఫీలయ్యాడు. అనంతరం ఇరువర్గాలు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. కొంతకాలం తరువాత రాజీపడి, లోక్ అదాలత్‌లో కేసులు కొట్టి వేయించుకున్నారు. బాలకృష్ణ గ్రామంలో పీర్ల పండుగ రోజు పంచె ఊడిపోయిన కారణంగా తనకు జరిగిన అవామానాన్ని మనసులో పెట్టుకున్నాడు. కక్ష పెంచుకుని శివారెడ్డిని చంపుతానని ప్రచారం చేశాడు.

పొలం నుంచి వస్తుండగా..

2018 మార్చి 30వ తేదీ సాయంత్రం 5.30 గంటల సమయంలో శివారెడ్డి, అతని కుమారుడు భాను ప్రకాష్‌రెడ్డి పొలంలో గడ్డి కోసుకుని బైక్‌పై ఇంటికి బయలుదేరారు. భాను ప్రకాష్‌రెడ్డి బైక్ నడుపుతుండగా, శివారెడ్డి వెనుక కూర్చుని మధ్యలో గడ్డి మోపు వేసుకున్నాడు. దారిలో అంకె భీముడు పొలం వద్ద బోయ సాకే బాలకృష్ణ, అతని చిన్న తమ్ముడు (మైనర్) బైక్‌పై ఎదురుగా వచ్చి అడ్డుకున్నారు. భాను ప్రకాష్‌రెడ్డి ఆపకుండా ముందుకు వెళ్లాడు. బాలకృష్ణ తమ్ముళ్లు రమేష్, అశోక్, సూర్యనారాయణ మరో బైక్‌పై వచ్చి భాను ప్రకాష్‌రెడ్డి మోటర్‌సైకిల్‌ను ఢీ కొట్టారు. దీంతో భానుప్రకాష్‌రెడ్డి, శివారెడ్డి కింద పడ్డారు. బాలకృష్ణ, అతని చిన్న తమ్ముడు, సూర్యనారాయణ వేటకొడవళ్లతో శివారెడ్డిని విచక్షణారహితంగా నరికారు. తన తండ్రిని చంపొద్దని భానుప్రకాష్‌రెడ్డి వేడుకున్నాడు. దీంతో అతన్ని కూడా చంపేందుకు బాలకృష్ణ తమ్ముళ్లు బోయ సాకే భాస్కర్, సాకే విజయ్, బాలకృష్ణ కొడుకు (మైనర్) ప్రయత్నించారు. భాను ప్రకాష్‌రెడ్డి అరుపులు విని పక్కపొలంలో ఉన్న భానుప్రకాష్ రెడ్డి చిన్నాన్న నరసింహారెడ్డి, నాగిరెడ్డి, సతీష్‌రెడ్డి అక్కడికి వచ్చారు. దీంతో వారిని కూడా చంపుతామని బెదిరిస్తూ.. వేటకొడవళ్లతో మూడు బైక్‌లలో పారిపోయారు. ఈ ఘటనపై భానుప్రకాష్‌రెడ్డి ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మొత్తం 12 మందిపై చార్జిషీటు దాఖలు చేశారు. వీరిలో ఇద్దరు బాలలు కావడంతో వారిపై జువైనల్ కోర్టులో కేసు నడుస్తోంది. మిగిలిన పది మంది బోయ సాకే బాలకృష్ణ, బోయ సాకే రమేష్, బోయ సాకే అశోక్, బోయ సాకే భాస్కర్, బోయ సాకే విజయ్‌కుమార్, తలారి సూర్యనారాయణ, తలుపూరి మహేంద్ర, బోయ సాకే ఓబుళమ్మ, బుక్కే ప్రభాకర్‌నాయక్, బొగ్గు ప్రసాద్‌పై సెషన్స్ కోర్టులో విచారించారు. బోయ సాకే రమేష్, బోయ సాకే అశోక్, బోయ సాకే భాస్కర్, బోయ సాకే విజయ్‌కుమార్, తలారి సూర్యనారాయణ, తలుపురి మహేంద్రపై నేరం రుజువైంది. వీరికి కోర్టు రెండు జీవిత కాలాల కఠిన కారాగార శిక్ష విధించింది. మిగిలిన ముగ్గురిపై నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టివేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున రాచమల్లు హరినాథ్‌రెడ్డి వాదనలు వినిపించారు. అప్పటి డీఎస్పీ వెంకట్రావ్, సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్, కోర్టు మానిటరింగ్ సిస్టం హెడ్ కానిస్టేబుల్ మల్లిరెడ్డి, కానిస్టేబుళ్లు రామ్మోహన్, చంద్రమౌళి, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు సాక్షులను కోర్టుకు తీసుకురావడంలో గట్టిగా కృషి చేశారు. ఎస్పీ జగదీష్ వారిని అభినందించారు.

కోర్టు ఆవరణలో రోదనలు

తీర్పు వెలువడిన అనంతరం కోర్టు ఆవవరణలో ముద్దాయిల కుటుంబసభ్యులు, బంధువులు బోరున విలపించారు. శిక్ష పడిన వారిలో ఐదుగురు అన్నదమ్ములు కావడంతో ఆ కుటుంబ సభ్యులందరూ కోర్టుకు హాజరయ్యారు. ముద్దాయిలను పోలీసులు బస్సులో జైలుకు తరలిస్తుండగా వారి చేతులను పట్టుకుని కన్నీరు మున్నీరయ్యారు. కొందరు మహిళలు సొమ్మసిల్లిపడిపోయారు. కుటుంబసభ్యుల ఆవేదన చూసి ముద్దాయిలు కంటతడిపెట్టారు. ఏమీ కాదని కొందరు కన్నీరు తుడిచి ధైర్యం చెప్పారు.

రైలు దొంగల ముఠా అరెస్ట్

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 23: రైలులో దోపిడీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను హిందూపురం జీఆర్పీ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 2 ల్యాప్‌టాప్‌లు, 4 మొబైల్ ఫోన్లు, 50 గ్రాముల బంగారు, 895 నిద్ర మాత్రలు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే సీఐ అశోక్‌కుమార్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల రైళ్లలో నేరాలు, దొంగతనాలు ఎక్కువ అవుతున్నాయని, వాటిపై దృష్టి సారించామన్నారు. ఈ క్రమంలో హిందూపురంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో అదుపులోకి తీసుకొని విచారించామని తెలిపారు. దీంతో వారు రైలు దొంగలుగా గుర్తించామన్నారు. వారు ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారని, ఇళ్లకు పీఓపీ పనులు చేసే రాంకరణ్, మనోజ్, హాకీవుల్లాగా గుర్తించామన్నారు. వీరు రైలు ప్రయాణికులను మాటల్లో ఉంచి, పెళ్లి కుదిరిందని, బిడ్డ పుట్టాడని సంతోషకర విషయం అని చెప్పి కూల్ డ్రింక్స్‌లో ముందుగా మత్తు మాత్రలు కలిపిన శీతల పానీయాలను అందిస్తున్నారన్నారు. అది తాగిన 20 నిమిషాల్లో ప్రయాణికులు పూర్తిగా మత్తులో నిద్రపోతారని, వారి వద్ద ఉన్న విలువైన నగలు, నగదు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు, ఇతర వస్తువులను దొంగలించి పక్క స్టేషన్లలో దిగిపోతున్నారని అన్నారు. వీరు బెంగళూరు బనశంకరిలో అద్దె గది చేసుకొని ఉన్నారన్నారు. ఇలా దొంగలించిన సొమ్మును లూధియానాలోని మనోజ్‌సింగ్‌కు అప్పజెప్పి లబ్ధి పొందుతున్నారన్నారు. త్వరలో మనోజ్‌ను కూడా అరెస్ట్ చేస్తామన్నారు. ఇప్పటికే అనంతపురం, హిందూపురం, బెంగళూరు, విజయవాడ రైల్వేస్టేషన్లలో నమోదైన కేసుల్లో చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. కొత్త వారు ఎవరైనా తినుబండారాలు, ఇతర వస్తువులు ఇస్తే తీసుకోరాదన్నారు. అనుమానితులుగా ఎవరైనా కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. వీరిని పట్టుకునేందుకు సహకరించిన ఆర్‌పీఎఫ్ ఎస్ఐలు బాలాజీనాయక్, నాగరాజు, ఏఎస్ఐలు శీనప్ప, సాయినాథ్‌రెడ్డి, ఇతర సిబ్బందిని సీఐ అభినందించారు.


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రిజర్వాయర్‌లో 1.653 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, సెప్టెంబరు 23: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.653 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం తెలిపారు. రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 912 క్యూసెక్కులు వస్తుండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 878 క్యూసెక్కులు వెళుతున్నట్లు వారు వెల్లడించారు.

అటవీ శాఖలో సెక్షన్ ఆఫీసర్ల బదిలీ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 23: ఉమ్మడి జిల్లాలో పలువురు సెక్షన్ ఆఫీసర్లను బదిలీ చేస్తూ జిల్లా అటవీశాఖాధికారి వినీత్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం రేంజ్ సెక్షన్ ఆఫీసర్‌గా పెనుకొండ రేంజ్‌లోని హిందూపురం సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న అక్బర్‌ను నియమించారు. పుట్లూరు సెక్షన్ ఆఫీసర్‌గా ఉన్న ప్రవీణ్‌కుమార్‌ను ఆత్మకూరుకు బదిలీ చేశారు. కదిరి సెక్షన్ ఆఫీసర్‌గా ఉన్న రామచంద్రారెడ్డిని కదిరి రేంజ్‌లోని కుర్లికి బదిలీ చేశారు. బుక్కపట్నం రేంజ్‌లో బుక్కపట్నం సెక్షన్ ఆఫీసర్‌గా ఉన్న చంద్రానాయక్‌ను పుట్టపర్తి సెక్షన్‌కు బదిలీ చేశారు.

పలువురు బీట్ ఆఫీసర్లకు స్థానచలనం

కదిరి రేంజ్‌లోని పెద్దన్నవారి పల్లి బీట్ ఆఫీసర్‌ను చారుపల్లి బీట్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. తుమ్మల బీట్ ఆఫీసర్ హరిప్రసాద్‌ను తనకల్లు కు, కొక్కంటి బీట్ ఆఫీసర్ భాస్కర్‌ను తుమ్మల నార్త్‌కు, కళ్యాణదుర్గం రేంజ్‌లోని ఓబులాపురం బీట్ ఆఫీసర్ రాజును పిల్లలపల్లికి బదిలీ చేశారు. పిల్లలపల్లి బీట్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యంను ధర్మపురికి, తుమ్మల నార్త్ బీట్ ఆఫీసర్ నారాయణను అనంతపురం రేంజ్‌లోని శింగవరం బీట్‌కు బదిలీ చేశారు. పెనుకొండ రేంజ్‌లోని సోమందేపల్లి బీట్ ఆఫీసర్ శిరీషను కొండపల్లి బీట్‌కు, మడకశిర బీట్ ఆఫీసర్ శ్రీనివాసులును పెద్దన్నవారిపల్లి బీట్‌కు, శింగవరం బీట్ ఆఫీసర్ వెంకటేశులును తుమ్మల సౌత్‌బీట్‌కు, చారుపల్లి బీట్ ఆఫీసర్ ప్రదీప్‌తేజను నల్లమాడ బీట్‌కు, కుర్లి బీట్ ఆఫీసర్ అనీల్‌కుమార్‌ను కొక్కంటి బీట్‌కు, ఎర్రకొండ బీట్ ఆఫీసర్ సుధాకర్‌బాబును సోమందేపల్లి బీట్‌కు, పెనుకొండ బీట్ ఆఫీసర్ మంజులవాణిని గుత్తి రేంజ్‌లోని యల్లనూరు బీట్‌కు బదిలీ చేశారు.

సీనియర్ అసిస్టెంట్ బదిలీ

జిల్లా అటవీశాఖ కార్యాలయంలో పదేళ్లకుపైగా పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ రమేష్‌ను సీసీఎఫ్ నాగేశ్వరరావు ఎట్టకేలకు బదిలీ చేశారు. తిరుపతి సీసీఎఫ్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

పరిశ్రమల శాఖలో బదిలీలు

అనంతపురం అర్బన్: జిల్లా పరిశ్రమల శాఖలో పనిచేస్తున్న పలువురు అధికారులను బదిలీ చేస్తూ ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ నాగరాజారావును అనకాపల్లికి బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న జిల్లా మేనేజర్ శ్రీధర్‌ను జిల్లాకు బదిలీ చేశారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మునినాథుడును చిత్తూరుకు బదిలీ చేశారు. కర్నూలు సూపరింటెండెంట్ రామాంజనమ్మను జిల్లాకు బదిలీ చేశారు. ఇక్కడ ఐపీఓలుగా పనిచేస్తున్న దుర్గేష్‌ను పుట్టపర్తికి, సుజనను నంద్యాలకు బదిలీ చేశారు. కడపలో పనిచేస్తున్న ఐపీఓలు నిషాంత్, భువనేశ్వరిలను జిల్లాకు బదిలీ చేశారు. నంద్యాలలో పనిచేస్తున్న ఐపీఓ రవీంద్రనాథ్‌రెడ్డిని జిల్లాకు బదిలీ చేశారు.

ఏఈఈలు..

అనంతపురం రూరల్, సెప్టెంబరు 23: ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ పరిధిలో ఏఈఈ, జూనియర్ ఇంజనీర్లను బదిలీ చేస్తూ ఆ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో 18మంది ఏఈఈలు, 20మంది జూనియర్ ఇంజనీర్లను బదిలీ చేశారు.

గనుల శాఖ డీడీగా వెంకటేశ్వర్లు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 23: జిల్లా గనులు, భూగర్భ వనరుల శాఖ డీడీగా వెంకటేశ్వర్లు నియమితుడయ్యారు. అమరావతిలోని ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న వెంకటేశ్వర్లును ఇక్కడికి బదిలీ చేస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న నాగయ్యను నరసరావుపేటకు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఏజీ రామకృష్ణ ప్రసాద్‌ను చిత్తూరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో తాడిపత్రిలో పనిచేస్తున్న ఆదినారాయణను నియమించారు. రాజమండ్రిలో పనిచేస్తున్న ఏజీ కృష్ణమూర్తిని ఇక్కడ మైన్స్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ మహబూబ్‌బాషాను శ్రీసత్యసాయి జిల్లాకు, ఆర్ఐ కవితను తాడిపత్రికి బదిలీ చేయగా ఆమె స్థానంలో మదనపల్లి నుంచి సుప్రజను ఇక్కడికి బదిలీ చేశారు. టెక్నికల్ అసిస్టెంట్ పురుషోత్తంను శ్రీసత్యసాయి జిల్లాకు, అమరావతిలో పనిచేస్తున్న జ్ఞానేశ్వరిని ఇక్కడికి బదిలీ చేశారు.

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కర్నూలుకు బదిలీ

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ పెద్దిరెడ్డి కిశోర్‌కుమార్‌రెడ్డిని కర్నూలుకు బదిలీ చేశారు. కర్నూలులో ఈఈగా పనిచేస్తున్న మునిప్రసాద్‌ను ఇక్కడికి బదిలీ చేశారు.

ఐసీడీఎస్‌లో పోస్టుల భర్తీకి శ్రీకారం

నోటిఫికేషన్ విడుదల

అనంతపురం విద్య, సెప్టెంబరు 23: మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖలో పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా 11 ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు సోమవారం ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి నోటిఫికేషన్ విడుదల చేశారు. పోస్టుల భర్తీపై ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న 84 అంగన్వాడీ టీచర్, మినీ అంగన్వాడీ టీచర్, హెల్పర్ పోస్టులను భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. అనంతపురం అర్బన్ ప్రాజెక్టులో 8, శింగనమల 6, నార్పల 9, అనంతపురం రూరల్‌లో 10, తాడిపత్రి 14, గుత్తిలో 5, ఉరవకొండ 12, కణేకల్లు 5, కంబదూరు 7, రాయదుర్గంలో 2 పోస్టులు ఖాళీలున్నాయన్నారు. ఈనెల 25 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, అక్టోబరు 1వ తేదీ ఆఖరి గడువని ఆమె స్పష్టం చేశారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 23: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ, బీపీఈడీ పరీక్షల ఫలితాలను ఇన్‌చార్జ్ వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు సోమవారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. ఏప్రిల్‌లో డిగ్రీ బీఏ, బీబీఏ, బీసీఏ, బీకామ్, బీఎస్సీ నాలుగో సెమిస్టర్ పరీక్షలను నిర్వహించామన్నారు. 6831 మంది పరీక్షలు రాయగా 3746మంది పాస్ అయ్యారని తెలిపారు. దీంతో ఉత్తీర్ణత శాతం 54.83గా నమోదైనట్లు పేర్కొన్నారు. జూలైలో నిర్వహించిన బీపీఈడీ ప్రథమ సెమిస్టర్‌లో 53, తృతీయ సెమిస్టర్‌లో 22మంది విద్యార్థులు పాస్ అయ్యారని తెలిపారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం జ్ఞానభూమి పోర్టల్‌ను సందర్శించాలని సూచించారు. ఫెయిల్ అయిన విద్యార్థులు రీవాల్యుయేషన్, ఫిజికల్ వెరిఫికేషన్ కోసం అక్టోబరు 10లోపు ఒక్కో పేపర్‌కు రూ.500 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినార్ డాక్టర్ లోకేష్, ఏఆర్ శంకర్, సూపరింటెండెంట్ మారుతీ, సీనియర్ అసిస్టెంట్ సాయిశివ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం విద్య, సెప్టెంబరు 23: ఐసీడీఎస్ పరిధిలోని బాల సదనంలో ఖాళీగా ఉన్న ఏడు ఉద్యోగాలను కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం కింద భర్తీ చేస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టోర్ కీపర్ పోస్టు ఒకటి, హౌస్ కీపర్ పోస్టు ఒకటి, రెండు ఎడ్యుకేటర్ (టీచర్) పోస్టులు, రెండు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కం మ్యూజిక్ టీచర్ పోస్టులు, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కం యోగా టీచర్ పోస్టు ఒకటి ఖాళీగా ఉన్నాయన్నారు. స్టోర్ కీపర్ పోస్టుకు ఎంపికైన వారికి రూ. 18,356 రెమ్యునరేషన్, హౌస్ కీపర్‌కు రూ. 7,944,, ఎడ్యుకేటర్ పోస్టుకు రూ.5000, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కం మ్యూజిక్ టీచర్‌కు రూ.5000, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కం యోగా టీచర్‌కు రూ.10 వేలు రెమ్యునరేషన్ అందజేస్తారన్నారు. దరఖాస్తులు, జీతం, అర్హతలు, ఇతర వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్ http:// ananthapuramu.gov.inలో పొందుపర్చామన్నారు. ఈ నెల 25 నుంచి అక్టోబరు 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామని పీడీ తెలిపారు.

8 నుంచి డిగ్రీ ఇయర్‌వైజ్ పరీక్షలు

అనంతపురం, కర్నూలు జిల్లాల విద్యార్థులకు మెగా సప్లిమెంటరీ

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 23: ఎస్కేయూ ఆధ్వర్యంలో 1994 నుంచి 2014వరకు డిగ్రీ ప్రవేశాలు పొంది ఫెయిలైన విద్యార్థులకు అక్టోబరు 8 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ సోమవారం ప్రకటనలో తెలిపారు. 2014 వరకు వార్షిక పరీక్షలు నిర్వహించేవారన్నారు. తర్వాత ఆరు నెలలకు ఒకసారి సెమిస్టర్ పద్ధతి ప్రవేశపెట్టినట్లు తెలిపారు. వివిధ కారణాల రీత్యా సంవత్సరం వారి పరీక్షల్లో ఫెయిల్ అయిన వారికి మెగా సప్లిమెంటరీ నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. 4వేలమందికిపైగా ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల విద్యార్థులు ఫీజులు చెల్లించారని తెలిపారు. వారందరికీ అక్టోబరు 8నుంచి 30వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బీకామ్ విద్యార్థులకు ఎస్కేయూలో, బీఏ విద్యార్థులకు ఆర్ట్స్ కళాశాలలో, బీఎస్సీ విద్యార్థులకు కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు వారి హాల్‌టికెట్లను www.skuniversity.ac.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 08554-255817, 9573761298 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

నవోదయ పరీక్ష గడువు పొడిగింపు

లేపాక్షి, సెప్టెంబరు 23: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశం కోసం అక్టోబరు 7వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాయడానికి అర్హులన్నారు. పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

టమోటా కిలో రూ.46

అనంతపురం రూరల్, సెప్టెంబరు 23: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.46తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. సోమవారం 2,250 టన్నుల టమోటాలు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.36, కనిష్ఠ ధర రూ.24 పలికినట్లు ఆయన తెలిపారు.

బకాయి వేతనాలు చెల్లించాలి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ధర్మవరం, సెప్టెంబరు 23: పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల జీతాలను వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తూ ఆర్డీఓ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సీఐటీయూ మండల కన్వీనర్ జేవీరమణ మాట్లాడుతూ ధర్మవరం డివిజన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డికి వినతి పత్రం అందజేశారు.మండల కో-కన్వీనర్‌లు అయూబ్‌ఖాన్, ఆదినారాయణ, సీపీఎం పట్టణ కార్యదర్శి శేషంపల్లి మారుతి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సాగులో ఉన్నరైతులకే పట్టాలివ్వాలి


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 23: పూర్వం నుంచి సాగులో ఉన్న రైతులకు పట్టాలిచ్చి ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డిని కోరారు. ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓను చిగిచెర్ల గ్రామంలోని సొసైటీ భూములలో జరిగిన అవకతవకలపై విన్నవించారు. చిగిచెర్ల గ్రామ పొలాల్లోని కో-ఆపరేటివ్ సొసైటీ భూములైన సర్వేనెంబర్లు 211, 212, 214, 215, 216, 218ల్లో 398 ఎకరాల భూమి ఉందని, ఆ భూములలో సొసైటీ ఏర్పాటు చేసి 75 మంది రైతులు 70 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారని ఆర్డీఓ దృష్టికి తీసుకువచ్చారు. గత ఏడాది అప్పటి తహసీల్దార్ యోగేశ్వరీదేవి అనర్హులకు పట్టాలిచ్చారన్నారు. ఏళ్ల తరబడి సాగులో ఉన్న రైతులకే పట్టాలివ్వాలన్నారు. ఎస్‌హెచ్ బాషా, మారుతి, వెంకటస్వామి, వెంకటనారాయణ, రమణ పాల్గొన్నారు.

26న ధర్నాకు తరలిరండి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న చేనేత నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 23: బత్తలపల్లి మండలం వేల్పుమడుగు వద్ద ఉన్న జేఆర్ సిల్క్స్ ఫ్యాక్టరీ వద్ద 26 తేదీన ఏపీ చేనేత కార్మిక పరిరక్షణ పోరాట సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామని అందరు తరలిరావాలని ఆ సంఘం నాయకులు పిలుపు నిచ్చారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని పలు వార్డులలో కరపత్రాలను వారు అందజేశారు. నాయకులు మధు, వెంకటనారాయణ, జంగాలపల్లిపెద్దన్న, మారుతి మాట్లాడుతూ చేనేతను రక్షించండి చేనేత పరిశ్రమను కాపాడండి అని గత కొన్నిసంవత్సరాలుగా పవర్‌లూమ్స్ పైపోరాటాలు చేస్తున్నామన్నారు. కానీ ధర్మవరంలో విచ్చలవిడిగా పవర్‌లూమ్స్ ఏర్పాటుచేసి చేనేత పరిశ్రమను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, రమణ, ఆదినారాయణ, శ్రీధర్, చట్టా గంగాధర్, శ్రీనివాసులు, వెంకటస్వామి, బాలరంగయ్య, నరసింహులు పాల్గొన్నారు.

పాపాగ్నిలో ఇసుక తరలింపు ఆపండి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

తనకల్లు, సెప్టెంబరు 23: మండలంలోని పాపాగ్ని నదిలో ఇసుక అక్రమ తరలింపును ఆపాలని సీపీఐ ఆధ్వర్యంలో పలువురు రైతులు సోమవారం తహసీల్దార్ శోభావర్లమ్మకు వినతిపత్రం అందించారు. పాపాగ్నిలో ఎక్స్‌కవేటర్లతో ఇసుకను తవ్వి కర్ణాటక, అన్నమయ్యజిల్లా, పక్క మండలాలకు తరలిస్తున్నారన్నారు. ఇసుక తరలింపుతో భూగర్భజలాలు తగ్గిపోయి, బోర్లలో నీటి శాతం తగ్గుతోందన్నారు. మండల కార్యదర్శి రెడ్డెప్ప, బూక్యా రవీంద్రనాయక్, మురళీనాయక్, శ్రీనివాసులు, రమణ పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు


మాట్లాడుతున్న సీడీపీఓ రాధిక

నంబులపూలకుంట, సెప్టెంబరు 23: మండల కేంద్రానికి సమీపంలోని ఎన్‌రెడ్డివారిపల్లిలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ రాధిక మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండడానికి ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు నరసమ్మ, లక్ష్మి, మౌలాబీ, ప్రధానోపాధ్యాయులు రామమోహన్ పాల్గొన్నారు.

పాఠశాలలకు మైక్ సెట్, బీరువా వితరణ

ముదిగుబ్బ, సెప్టెంబరు 23: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 1991-92సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు జడ్పీ బాలుర, బాలికల పాఠశాలలకు మైక్ సెట్, బీరువాలను సోమవారం వితరణ చేశారు. తాము చదివిన పాఠశాలను గుర్తుంచుకొని వస్తువులు అందించిన పూర్వ విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు రాఘవేంద్ర, రమాదేవి అభినందించారు. పూర్వ విద్యార్థులు ఫకృద్దీన్, జగన్, రామానాయుడు, మౌళి, చంద్రకళ, శివమ్మ, శ్రీదేవి, మునిస్వామి, భీమ్లానాయక్, ఉపాధ్యాయులు నాగరాజు, ఉమాదేవి, బాబ్జాన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 23: ప్రభుత్వ కార్యాలయాలకు ప్రీపెయిడ్ స్మార్టు మీటర్లను మొదటి విడతగా అమర్చుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రామసూరారెడ్డి, స్మార్టుమీటర్ల జేఈ రమణ పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో స్మార్టు మీటరు అమర్చారు. సిబ్బంది సాయినాథ్, సాయితేజ, సాయికుమార్, హరి పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

నల్లచెరువు, సెప్టెంబరు 23: మండలంలోని మద్దిమడుగులో సోమవారం పంటకోత ప్రయోగాలు నిర్వహించినట్లు ఏఓ భారతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. మద్దిమడుగు గ్రామానికి చెందిన సిద్ధారెడ్డి సర్వేనెంబర్ 81లో ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగలో పంటకోత ప్రయోగాలు చేశామన్నారు. 5 ఇన్‌టూ 5లో ప్రయోగాలు చేయగా 4కేజీల 850 గ్రాముల దిగుబడి వచ్చిందన్నారు. ఉపగణాంకాధికారి శివప్రసాద్, సహాయ గణాంకాధికారి భాస్కర్, వీఆర్‌ఓ ముబారక్, ఈఏఏ ప్రశాంతి, సుబ్బయ్య పాల్గొన్నారు.

హంద్రీనీవా నీటిని తెస్తాం: ఎమ్మెల్యే

గాండ్లపెంట, సెప్టెంబరు 23: త్వరలో మండలానికి హంద్రీనీవా నీరు తెస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని కురమామిడి పంచాయతీ రెక్కమాను గ్రామంలో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆయనను నాయకులు పూలమాలలు వేసి స్వాగతించారు. అంగన్‌వాడీకేంద్రంలో బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కదిరి, రాయచోటి ప్రధాన రహదారి గుంతలమయం అయిందని, నిత్యంప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రయాణం నరకప్రాయంగా మారిందన్నారు. రహదారి మరమ్మతులను అధికారం చేపట్టిన నెలకే చేపట్టామన్నారు. గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు.

రోడ్ల నిర్మాణానికి భూమి పూజ: మండలంలోని కొట్లపల్లి వయా పోతువాండ్లపల్లికి రూ.39 లక్షల నిధులతో చేపట్టే పనులను ఎమ్మెల్యే కందికుంట ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీఓ రామానాయక్, వివిధ శాఖల అధికారులు ఎంపీపీ గంగోజమ్మ, కన్వీనర్ కొండయ్య, ఎంపీటీసీ సోముశేఖర్‌రెడ్డి, సర్పంచ్ శివప్పనాయుడు, సుధాకర్, మాజీ సింగల్ విండో డైరెక్టర్ వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్, ఆనంద్, అక్రమ్, లోకేష్, కాకార్ల రవీంద్రారెడ్డి, జనసేన సత్యవతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

పారిశుధ్య కార్మికులు ఆరోగ్య పరిరక్షకులు

కదిరి: పారిశుధ్య కార్మికులు ఆరోగ్య పరిరక్షకులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్యం బాగుండాలన్నారు. నెలకొక్కసారి కార్మికులు పరీక్షలు చేయించుకునేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. డాక్టర్ హుస్సేన్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు. డాక్టర్ విజయలక్ష్మి, వైద్యసిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి రథోత్సవం

పుట్టపర్తి సెప్టెంబరు 23: శ్రీకాకుళం భక్తులు సత్యసాయి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణ వీధుల్లో సత్యసాయి రథాన్ని లాగుతూ సంగీతం, భక్తులను అలరింపజేశారు. మొదట సత్యమ్మగుడి వద్ద సత్యసాయి రథానికి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. రథం ముందర రాధాకృష్ణులు, గోపికలతో చిన్నారులు నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. కోలాటం, భక్తిపాటలతో సత్యసాయి రథోత్సవం సాగింది. సత్యసాయి నామంతో పుట్టపర్తి వీధులు పులకించాయి. మూడు వేల మంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సాయికుల్వంత్ మందిరానికి వెళ్లి సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.


నృత్యం చేస్తున్న చిన్నారులు


సత్యసాయి రథాన్ని ఊరేగిస్తున్న శ్రీకాకుళం భక్తులు

ధర్మవరం చెరువుకు నీరివ్వాలి

ధర్మవరం, సెప్టెంబరు 23: ధర్మవరం చెరువుకు హంద్రీనీవా నీటిని తెచ్చేలా ప్రభుత్వ పెద్దలతో మాట్లాడాలని మండలంలోని తిప్పేపల్లి, సంగాల గ్రామాల రైతులు జనసేనపార్టీరాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డికి విన్నవించారు. రైతులు సోమవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. ఆయా గ్రామాల రైతులు మాట్లాడుతూ ధర్మవరం చెరువు నుంచి నీటి వసతి కలిగిన సంగాల కాలువ ఉందని, దాదాపు 400 ఎకరాలకుపైగా రైతులు పంటలు సాగు చేస్తున్నారన్నారు. చెరువుకు నీరు రావడంతో ఐదేళ్ల నుంచి వరి పంటను సాగుచేసుకుంటున్నామని, ఈ ఏడాది కూడా నీరు వస్తుందని వరింటను సాగుచేశామన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయనను కోరారు.

పోలీసు కుటుంబాలకు తక్షణసాయం రూ.లక్ష: ఎస్పీ

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 23: పోలీసు శాఖలో పనిచేసే సిబ్బంది విధినిర్వహణలో చనిపోతే తక్షణసాయంగా రూ.లక్ష అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ వీ రత్న అన్నారు. సోమవారం డీపీఓలో జిల్లాపోలీసు అధికారుల సంక్షేమ సంఘం నాయకులు ఎస్పీని కలిశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ఇదివరకు మృతిచెందిన వారికి విడతలవారిగా రూ.లక్ష అందించేవారన్నారు. ఒకేసారి ఆ మొత్తం అందిస్తే కుటుంబానికి ఉపయోగపడుతుందన్నారు. స్పందించిన ఎస్పీ ఒకేసారి అందేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సభ్యులు సూర్యకుమార్, ఈశ్వరయ్య, గోవిందు, ఏఎస్ఐ షౌకత్‌అలీ పాల్గొన్నారు. అనంతరం అడిషనల్ సీఎస్పీ ఆర్ల శ్రీనివాసులును సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రేపటి నుంచి చెకుముకి సైన్సు పరీక్షలు

కదిరి అర్బన్, సెప్టెంబరు 23: జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం నుంచి చెకుముకి సైన్సు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నరసారెడ్డి సోమవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో విడుదల చేశారు. 25న పాఠశాల స్థాయి, అక్టోబరు 1న మండలస్థాయి, అక్టోబరు 27న జిల్లాస్థాయి, నవంబరు 9న రాష్ట్రస్థాయి పరీక్షలు జరుగుతాయన్నారు. 8, 9, 10 తరగతులు అన్ని యజమాన్య విద్యార్థులు పరీక్షలకు అర్హులన్నారు. వీరస్వామి, చిన్నారావు, పుల్లారెడ్డి, అశ్వత్థనారాయణ, సురేష్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

మట్టి తరలింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 23: మండలంలోని ఇనగలూరు పంచాయతీలో మట్టి అక్రమ తరలింపుపై చర్యలు చేపట్టాలని సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సీపీఐ నాయకులు ఆంజనేయులు, చలపతినాయుడు తెలిపారు. మట్టిని అక్రమంగా రోడ్డుకు వినియోగించుకుంటున్నారని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరినట్లు తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ

నల్లమాడ, సెప్టెంబరు 23: మండలకేంద్రంలోని సచివాలయం-1లో టీడీపీ నాయకులు ఇది మంచి ప్రభుత్వం పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. పలువురు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వందరోజులు అయిందన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి, స్టిక్కర్లు అతికించారు. పంచాయతీ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, సర్పంచ్ రమావత్ భారతి, కన్వీనర్ మైలే శివశంకర్, బుట్టి నాగభూషణనాయుడు, మైలే రామచంద్ర, మణికుమారి, మైలే హరి, ఎస్. శివారెడ్డి, ప్రభాకర్, అబ్బాస్‌ఖాన్, ఎస్. కేశవరెడ్డి పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

ముదిగుబ్బ, సెప్టెంబరు 23: మండలంలోని పట్నం పోలీస్ స్టేషన్ పరిధి టీఎన్ పాళ్యం సమీపంలో పేకాట స్థావరంపై పట్నం పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించినట్లు రూరల్ సీఐ శ్యామ్‌రావు, పట్నం ఎస్ఐ నరసింహులు తెలిపారు. అందిన సమాచారం మేరకు టీఎన్ పాళ్యం సమీపంలో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేసి 9 మందిని అరెస్ట్ చేయడంతో పాటు మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని, రూ.70,600 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒక వ్యక్తి పరారయ్యాడని, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వందరోజుల్లో ఊహించని అభివృద్ధి


కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 23: వందరోజులు చంద్రబాబు నాయుడు పాలనలో ఊహించని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యాయని మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర అన్నారు. సోమవారం మండలకేంద్రలో ఇంటంటికెళ్లి వందరోజు కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను కరపత్రాల రూపంలో ప్రచారం చేశారు. మండెం చాంద్‌బాషా, చికెన్ షాను, మండోజీ ఆరీఫ్‌ఖాన్, అబ్బు, మస్తానమ్మ, సౌదీ నాగరాజు, వీఆర్‌ఓ శ్రీలత, సచివాలయ సిబ్బంది మదన్, హరి, సలీం, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

నంబులపూలకుంట, సెప్టెంబరు 23: మండలంలోని పి.కొత్తపల్లి గ్రామానికి మంగళవారం కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరుకానున్నట్లు కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, సర్పంచ్ చంద్రకళ, మాజీ సర్పంచ్ శ్రీరాములనాయుడు సోమవారం ఒక ప్రటనలో తెలిపారు. ఇదిమంచి ప్రభుత్వ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరువుతున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి అధికారులతోపాటు కూటమినాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

మీర్జాపురంలో

కొత్తచెరువు: మండలంలోని మీర్జాపురం గ్రామంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బారాన్‌సాబ్ సోమవారం ఒక ప్రకటనలోతెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లెసింధురారెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులు పాల్గొనాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

బుక్కపట్నం, సెప్టెంబరు 23: మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మక్బూల్ హుస్సేన్ అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. అలాగే సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కెనరాబ్యాంకు జిల్లా సమన్వయ అధికారి శివశంకర్‌రెడ్డి హాజరై సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఓబులేసు పాల్గొన్నారు.

వరద బాధితులకు దుస్తుల సేకరణ


విజయవాడకు బట్టలు పంపేందుకు సిద్ధం చేస్తున్న బట్టలు

కదిరి అర్బన్, సెప్టెంబరు 23: విజయవాడ వరద బాధితుల సహాయార్థం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బట్టలు సేకరించారు. సోమవారం సేకరించిన బట్టలను విజయవాడ అంగన్‌వాడీ యూనియన్‌కు పంపుతున్నట్లు జిల్లా అధ్యక్షురాలు మాబున్నీసా తెలిపారు. లక్ష్మీదేవి, శారద, సుజాత, భాగ్య, సునిత, సీపీఐటియు జగన్మోహన్, రామమోహన్, నారాయణ, క్రిష్ణనాయక్, ఎస్ఎఫ్ఐ బాబ్‌జాన్ పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూలో కల్తీకి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

● జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం


సంఘీభావ దీక్ష చేపడుతున్న చిలకం, జనసేన నాయకులు

ధర్మవరం,సెప్టెంబరు 23: హిందువులు మహాప్రసాదంగా భావించే శ్రీవారి లడ్డూలో వినిగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలపడం నీచమైన చర్య అని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శ్రీవారి లడ్డూలో కల్తీ చేయడాన్ని నిరసిస్తూ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా ధర్మవరంలో చిలకం మధుసూదన్‌రెడ్డి కొత్తపేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో దీక్ష చేపట్టారు. ముందుగా వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి హిందువు, సనాతన ధర్మాన్ని పాటించేవారందరూ ఈ అక్రమాలను ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. వెంకటేశ్వరస్వామి జోలికి వచ్చినవారు ఏమైయ్యారో అందరికి తెలుసన్నారు. వైఎస్‌జగన్ కూడా శ్రీవారి జోలికి వెళ్లాడని అందుకే గత ఎన్నికలలో ఘోర పరాజయం పొందారన్నారు. జనసేన నాయకులు బెస్త శ్రీనివాసులు, అడ్డగిరి శ్యాంకుమార్, రాజారెడ్డి, వెంకటరెడ్డి, నాగసుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతు

కదిరి అర్బన్: తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీకి ప్రయశ్చిత్తంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో జనసేన నాయకులు సోమవారం దీక్షచేపట్టారు. వారు మాట్లాడుతూ లడ్డూ ప్రసాదంలో జంతువులకొవ్వును, చేప నూనెను వినియోగించిన గత టీటీడీ చైర్మన్ వైవీసుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భైరవప్రసాద్, చలపతి, కుటాల లక్షణ్, రాజేంద్రప్రసాద్, రమణ, గంగరాజు, రాజేష్, సోముశేఖర్, పార్థసారధి పాల్గొన్నారు.


కదిరి: మద్దతు దీక్షలో పాల్గొన్న జనసేన నాయకులు


రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

బుక్కపట్నం, సెప్టెంబరు 23: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని పాముదుర్తి పంచాయతీలో సోమవారం ఇది మంచి ప్రభుత్వంలో ఎమ్మెల్యేతోపాటు, మాజీ మంత్రి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ప్రజాసంక్షేమ పాలన సాగుతోంది. గత ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందన్నారు. చంద్రబాబునాయుడు నాయత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి సమానంగా చేస్తూ ముందుకెళుతోందన్నారు. నియోజకవర్గంలోని బుక్కపట్నం చెరువు, మరాల రిజర్వాయర్లకు త్వరలో హంద్రీనీవా నీరు తీసుకొచ్చి రైతులను ఆదుకుంటామన్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార వారోత్సవలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. పౌష్టికాహారం గర్భిణులకు అందించాలని అక్కడే ఉన్న అధికారులకు సూచించారు. గర్భిణులకు పసుపుకుంకుమ ఇచ్చి సీమంతం చేశారు. గ్రామంలో సీసీరోడ్లకు భూమి పూజ చేశారు. ఎంఈఓ గోపాల్‌నాయక్, ఏఓ సతీష్‌బాబు, అన్నిశాఖల అధికారులు, టీడీపీ మండలకన్వీనర్ చింతా మల్లిరెడ్డి, గంగాధర్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆశ్రయం కల్పించండి


ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న అరుణజ్యోతి

కదిరి(అమడగూరు), సెప్టెంబరు 23: మండలంలోని గాజులపల్లి వద్ద నున్న మాతృశ్రీ వృద్ధాశ్రమానికి ఆశ్రయం కల్పించాలని నిర్వాహకురాలు అరుణజ్యోతి సోమవారం ఎంపీడీఓ మునియప్పకు వినతిపత్రం అందచేశారు ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్మించిన భవనంలో అనుమతి తీసుకుని 20 మంది వృద్ధులతో ఆశ్రమం నిర్వహిస్తున్నామన్నారు. అదే భవనంలో మరో గది అదనంగా ఉందని, దానికి కాంట్రాక్టర్ బిల్లులు చెల్లించలేదని తాళాలు వేశారన్నారు. ఆశ్రమంలో వృద్ధులకు స్థలం సరిపోక ఇబ్బందులు పడుతున్నారని, ఆశ్రమం నిర్మాణం అయ్యేంతవరకు ఆ గదిని ఉపయోగించుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. స్పందించిన ఎంపీడీఓ పరిశీలిస్తామన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం


సమస్యలు తెలుసుకుంటున్న టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మనోహర్

ముదిగుబ్బ, సెప్టెంబరు 23: మండలంలో నెలరోజులుగా నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్ అన్నారు. సోమవారం స్థానిక దొరిగల్లు రోడ్డులో ఉన్న సత్యసాయి ప్రాజెక్టు సంపును ఆయన పరిశీలించారు. సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంపు హౌస్‌లో కొన్ని మోటర్లు పనిచేయడం లేదని, పలుచోట్ల మరమ్మతులు కూడా చేయాల్సిన అవసరం ఉందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయన మాట్లాడుతూ మంత్రి సత్యకుమార్ యాదవ్, ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకువెళ్ళడంతో ముదిగుబ్బలో ఏర్పడ్డ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం తాగునీటిని సరఫరా చేశారు. చికెన్ తిరుపాల్, జయచంద్ర, వెంకటేష్, శీనా, రామ్మూర్తి, సూరి, రవి పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించిన బ్లూమూన్ విద్యార్థులు


ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కదిరి అర్బన్, సెప్టెంబరు 23: క్రీడా పోటీల్లో బ్లూమూన్ విద్యార్థులు రాణించినట్లు విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్ తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో మూడురోజులుగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. అండర్-14లో జ్యోత్స్న, పావని, హర్షిత, నవ్యత, వర్షారెడ్డి, దీక్షితారెడ్డి, రేవంత్, రోహిత్, పీఎస్ ప్రసాద్‌రెడ్డి, మోక్షజ్ఞ, జావలిన్ అండర్ 17 బాలబాలికల విభాగంలో షామీరా, పూర్ణిమ, అనూజా, సాహిద్, హరిహర, వెంకటసాయి ప్రతిభ చాటారన్నారు. వీరిని ఉపాధ్యాయులు, యాజమాన్యం అభినందించారు. ప్రధానోపాధ్యాయులు సురేంద్రరెడ్డి, ఇన్‌చార్జి మాధవరెడ్డి, పీఈటీలు రామాంజులరెడ్డి, డేనియల్ పాల్గొన్నారు.

దేవాలయాల పరిరక్షణ.. హిందువుల బాధ్యత


సమావేశంలో పాల్గొన్న విశ్వహిందూపరిషత్ నాయకులు

కదిరి(అమడగూరు),సెప్టెంబరు 23: దేవాలయాలను పరిషరించడం హిందువుల బాధ్యత అని విశ్వహిందూపరిషత్ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రలోని చౌడేశ్వరీ కళ్యాణమండపంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూతిరుమల వెంకటేశ్వరస్వామి ప్రసాదంలో జంతువుల కొవ్వును, చేప నూనెను వినియోగించడంతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. వీరిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్మప్రచార కర్త శ్రీనివాస్‌గుప్త, ప్రఖండ కార్యదర్శి గోరంట్ల రమేష్, ఓం ప్రకాష్‌స్వామి, మండల కన్వీనర్ సురేంద్రరెడ్డి, అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, సుబ్బిరెడ్డి, ఉపాధ్యక్షులు ఆంజి పాల్గొన్నారు.

కొత్తచెరువు: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీకి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని హిందూ ధర్మపరిరక్షణ సమితి సభ్యులు తహసీల్దార్ నీలకంఠారెడ్డికి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. మొదట పురాతన వేణుగోపాలస్వామి ఆలయం నుంచి ర్యాలీగా నినాదాలు చేస్తూ నెహ్రూ కూడలి మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. శేషాద్రినాయుడు, దివ్యతేజ, గాజుల నాగేంద్ర, అమరా చంద్రబాబు నాయుడు, పీఎస్ వెంగప్ప, రవికుమార్, లోచర్లపెద్దన్న, టెలిఫోన్ వెంకటేశ్, శంకర్‌బాబు, శివప్రసాద్, సుబ్రహ్మణ్యం, కేశవ పాల్గొన్నారు.

అమ్మ.. భారమైంది..!

కని.. పెంచి.. పోషించిన..
అమ్మ భారమైంది..
పిడికెడు అన్నం పెట్టలేక..
పోషణ కష్టమైందంటూ..
తొమ్మిది పదుల వయసున్న
కదలలేని.. మెదలలేని..
కన్నతల్లిని వదిలించుకున్నారు..
నిర్దాక్షిణ్యంగా రోడ్డుపై పడేశారు..
ఇద్దరు కొడుకులున్నా..
అమ్మను అనాథగా చేశారు..



రోడ్డు పక్కన రోదిస్తున్న వృద్ధురాలు

మానవత్వం మరచి కన్న కుమారులే 90 ఏళ్ల వృద్ధురాలిని రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయారు. మడకశిర పట్టణంలోని శివాపురం కాలనీకి చెందిన లక్ష్మీదేవమ్మకు ఇద్దరు కుమారులున్నారు. ఒకరు కదిరిలో ఉన్నారు. మరొకరు ఏ గ్రామంలో ఉన్నదీ తెలీదు. వారికి కన్నతల్లే భారమైంది. ఆమెను పోషించలేక సోమవారం సాయంత్రం పట్టణానికి 2 కిలోమీటర్ల దూరంలో పెనుకొండ ప్రధాన రహదారిపై వదిలేశారు. కదలలేని, మెదలలేని స్థితిలో ఆ వృద్ధురాలు ఆర్తనాదాలు చేసింది. తులసీధామ వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు తిమ్మప్ప అక్కడికి చేరుకుని, వృద్ధురాలిని ఆశ్రమానికి తీసుకెళ్లారు.

-మడకశిర రూరల్

ఇది మంచి ప్రభుత్వంపై ఇంటింటి ప్రచారం



పెనుకొండలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 23: ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ అభివృద్ధిపై వివరించారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సోమవారం టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములుయాదవ్ ఆధ్వర్యంలో 11వ వార్డు తోటగెరి, గడంగివీధి తదితర ప్రాంతాల్లో వంద రోజుల పాలనపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పూల శ్రీనివాసులు, ఆవుల నరేంద్ర, కన్నా, చంద్రకాంతమ్మ పాల్గొన్నారు.

చిలమత్తూరు: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూ అండగా నిలుస్తోందని నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పాతచామలపల్లిలో జనసేన, టీడీపీ నాయకులు కలిసి ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో నాయకులు చిన్న ప్రవీణ్, జగదీష్, నారప్ప, మణికంఠ, విశ్వనాథరెడ్డి, లక్ష్మీనారాయణప్ప, నరసింహప్ప పాల్గొన్నారు.

గుడిబండ: పేద ప్రజల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఎనలేని కృషిచేస్తోందని టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తాళికెర పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనరసప్ప, బీమరాజు, ప్రకాశ్, షబ్బీర్, ఈరణ్ణ, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: పెనుకొండ నగర పంచాయతీ కోనాపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెల్లం శివశంకర్, సచివాలయ ఉద్యోగులు కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనపై ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు.

సబ్ జైలులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి



ఖైదీలతో వివరాలు ఆరాతీస్తున్న శివప్రసాద్ యాదవ్

హిందూపురం, సెప్టెంబరు 23: స్థానిక సబ్‌జైలులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సూచించారు. సోమవారం హిందూపురం వచ్చిన ఆయన సబ్‌జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. ప్రతి వారం వైద్య పరీక్షలు చేయించాలని సబ్‌జైలు అధికారికి సూచించారు. ఎవరికైనా న్యాయవాదులు ఏర్పాటు చేసుకునే స్థోమత లేకపోతే కోర్టు దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది నవేరా, లోక్ అదాలత్ సిబ్బంది శారద, హేమావతి పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సోమవారం పెనుకొండ సబ్‌జైలును తనిఖీ చేశారు. ఖైదీలతో సమావేశం నిర్వహించి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం మరుగుదొడ్లు, రికార్డులగది, వంట గదిని పరిశీలించారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, సెప్టెంబరు 23: మండలంలోని రెండు వేర్వేరుచోట్ల సోమవారం ఇద్దరు ఆత్మహత్యకు యత్నించారు. పులేరు గ్రామానికి చెందిన నరసింహ, ముత్యాలమ్మ దంపతుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో ముత్యాలమ్మ క్రిమిసంహారక మందు తాగింది. ముద్దలకుంట్లపల్లికి చెందిన వృద్ధుడు శంకరప్ప గొర్రెలకు ఉపయోగించే క్రిమిసంహారక మందు తాగాడు. తరచూ తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇద్దరిని గోరంట్ల ప్రభుత్వ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ ఉష ప్రాథమిక చికిత్సలు చేసి, మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

వంద రోజుల్లోనే అభివృద్ధి చూపాం: ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ బీకే పార్థసారథి

మడకశిర టౌన్, సెప్టెంబరు 23 : రాష్ట్రంలోనూ, మడకశిర నియోజకవర్గంలోనూ గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో చేయలేని అభివృద్ధిని వంద రోజుల్లో చేసి చూపామని హిందూపురం పార్లమెంటు సభ్యుడు బీకే పార్థసారథి అన్నారు. సోమవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో జగన్ ఆర్థిక వ్యవస్థలను చిన్నాభిన్నం చేశారని, ఏమాత్రం నిధులు లేకపోయినా ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఆలోచనలు, అనుభవంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టే పనిచేస్తున్నారని కొనియాడారు. ఐదేళ్ల అభివృద్ధిని పట్టించుకోని వైసీపీ నేతలు తామచేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక విమర్శలకు దిగుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు తాము చేస్తున్న అభివృద్ధిని విశ్వసిస్తున్నారని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.38కోట్లు భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన జీవోలను చూపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గం పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ జీవోలు ఇచ్చారని తెలిపారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన సేవలు అందించాలి

వైద్యం కోసం వచ్చే ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యసేవలు అందించి వారి మన్ననలు పొందాలని ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. సోమవారం మడకశిర వైద్య విధాన పరిషత్‌లో పారిశుధ్య కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. వైద్యులు శశిరేఖ, దివాకర్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

అమరాపురం : మడకశిర నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని హిందూపురం పార్లమెంటు సభ్యుడు పార్థసారథి పేర్కొన్నారు. మండల పరిధిలోని నిడ్రఘట్ట గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హిందూపురం ఎంపీ పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నిడ్రఘట్టలో అంబేడ్కర్ భవనం, కనకదాస భవనం, గొల్లమారనపల్లి వాటర్ ప్లాంట్‌కు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సీఎస్ఆర్ నిధుల కింద మడకశిర నియోజకవర్గంలో 38 వాటర్‌ప్లాంట్లు మంజూరు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వంద రోజుల్లో మడకశిర నియోజకవర్గంలోని అనేక సమస్యలను పరిష్కరించామన్నారు. నిడ్రఘట్ట పంచాయతీకి రూ.38లక్షలతో వాటర్ ట్యాంక్ ఏర్పాటుతోపాటు రూ.45లక్షలతో సీసీ రోడ్ల ఏర్పాటు, కర్ణాటక సరిహద్దు వరకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. గర్భవతులకు సామూహిక సీమంతం కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎంపీలు పాల్గొన్నారు. మహిళా సాధికారత కోసం వెలుగు పథకం కింద రూ.1.85కోట్లు నిధులు బ్యాంకు రుణాల చెక్కును అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, నాయకులు డాక్టర్ శ్రీనివాసమూర్తి, గణేష్, జయకుమార్, నరసింహమూర్తి, పాండురంగప్ప, శివరుద్రప్ప, కృష్ణమూర్తి, రామిరెడ్డి, మారుతీప్రసాద్, రామచంద్రప్ప, మంజునాథ్, సర్పంచు లోకేష్, హనుమంతరాయ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా అమరాపురం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలు నిధులతో అదనపు భవనాల నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.

పారిశుధ్య కార్మికులే రియల్ హీరోలు

మున్సిపల్ కమిషనర్... కార్మికులకు వైద్య పరీక్షలు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 23: సమాజంలో రియల్ హీరోలు పారిశుధ్య కార్మికులే అని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌లో ఆయన మాట్లాడుతూ సరిహద్దులో సైనికులు ఎంత ముఖ్యమో, సమాజ సేవలో పారిశుధ్య కార్మికులు అంతే ముఖ్యం అన్నారు. సమాజంలోని ప్రజలు ఆరోగ్యంగా ఉన్నారంటే అందుకు ముఖ్య కారకులు కార్మికులే అన్నారు. కరోనా సమయంలో ప్రపంచం మొత్తం ఇళ్లకు పరిమితమైన సమయంలో పారిశుధ్య కార్మికులు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పని చేశారని గుర్తుచేశారు. అలాంటి కార్మికులు ఆరోగ్యంగా ఉండాలని హెల్త్‌క్యాంప్ చేపట్టామన్నారు. 380 మంది కార్మికులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు డీఈ రమేష్, అంజలీ, నవీన్, నాయకులు రమేష్‌రెడ్డి, పార్థసారథి, అమర్‌దేవేంద్ర, భాగ్యలక్ష్మీగౌడ్, రవితేజారెడ్డి, వైద్యులు డేవిడ్‌రాజ్, జక్కా నరేంద్ర, నందిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

పెనుకొండ: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు మోహన్‌నాయక్, శివప్రసాద్‌నాయక్, భాస్కర్‌రెడ్డి, నేహ, తేజ నగర పంచాయతీ కార్యాలయంలో సమావేశ భవనంలో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో చెట్లకు పాదులు తీసి నీళ్లుపోసి చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, నాయకులు రామక్రిష్ణ, రామాంజనేయులు, హనుమంతు, సూరి పాల్గొన్నారు.

నిలువ ఉంచిన టపాసులు సీజ్

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 23 : మండల పరిధిలోని పాత సినిమా హాలు ఎదురుగా శివ అనే వ్యక్తి ఇంటి నుంచి సోమవారం అనుమతులు లేని టపాసులు సీజ్ చేసినట్లు ఎస్ఐ రంగడు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా దీపావళి పండగను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా ఇతర ప్రాంతాల నుంచి టపాసులు తెచ్చి అక్రమంగా నిలువ ఉంచడంతో తనిఖీలు చేశామన్నారు. సుమారు రూ.3లక్షలు విలువచేసే టపాసులను తహసీల్దార్ హసీనాసుల్తానా ఆధ్వర్యంలో సీజ్ చేసి కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా పెద్దరెడ్డిపల్లి నంజుండప్ప అనే వ్యక్తి కర్ణాటక నుంచి 90 టెట్రా మద్యం ప్యాకెట్లను తరలిస్తుండగా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చిలమత్తూరు : ఎలాంటి అనుమతులు లేకుండా ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచుకున్న టపాసులను సీజ్ చేసి సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు. సోమవారం మండల కేంద్రానికి చెందిన మోహన్ అనే వ్యక్తి తన ఇంట్లో అక్రమంగా టపాసులు నిల్వ ఉంచుకున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టామన్నారు. పలురకాల టపాసులు పెద్ద మొత్తంలో బయటపడ్డాయని, వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచుకున్న మోహన్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

హిందూపురం(సోమందేపల్లి): సోమందేపల్లిలో అక్రమంగా నిలువ ఉంచిన రూ.9 లక్షల విలువైన టపాసులను సోమవారం పోలీసులు పట్టుకున్నారు.



సీజ్ చేసిన టపాసులను చూపుతున్న తహసీల్దార్, ఎస్ఐ, సిబ్బంది

టపాసులు విక్రయిస్తున్న వినోద్, రవిని అరెస్టు చేశారు. దీపావళి పండుగ నేపథ్యంలో కొందరు ముందస్తుగా పెద్దఎత్తున టపాసులను అక్రమంగా నిలువ ఉంచినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు పోలీసులు.. దుకాణాలపై దాడులు చేశారు. పెద్దఎత్తున బాణసంచా నిల్వ ఉంచుకున్నట్లు గుర్తించిన పోలీసులు సరుకును సీజ్ చేశారు. సోమందేపల్లికి చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. చిలమత్తూరు, హిందూపురంలో కూడా అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులను పోలీసులు సీజ్ చేశారు.

జీతగాళ్లకు విముక్తి కలిగించాలి

పావగడ, సెప్టెంబరు 23 : ఏళ్ల తరబడి పెత్తందారుల ఇళ్లలో భోజన సౌకర్యం కోసమే వెట్టిచాకిరి చేస్తున్న జీతగాళ్లను ప్రభుత్వం గుర్తించి విముక్తి కలిగించాలని జీవిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తాలూకా వ్యాప్తంగా దాదాపు రెండువేల మంది జీతగాళ్లను ప్రభుత్వం గుర్తించి వారికి గుర్తింపు కార్డులు అందించిందని తెలిపారు. ఇటీవల విడుదల చేసిన జీతగాళ్లకు మౌళిక సదుపాయాలు కల్పించి అన్నివిధాలా ఆదుకోవాలని జీవిక సంఘం తాలూకా అధ్యక్షుడు నరసింహమూర్తి తెలిపారు. అనంతరం తహసీల్దార్ వరదరాజుకు వినతిపత్రం అందించారు. నాయకులు హనుమంతరాయ, గంగాధర, దేవలకేరి హనుమంతరాయ, నరసింహమూర్తి పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న జీవిక సంఘం నాయకులు

పౌర కార్మికుల సేవలు వెలకట్టలేనివి : ఎమ్మెల్యే

పావగడ, సెప్టెంబరు 23 : ఉదయం 4గంటలకే తమ ఇంటి పనులు కూడా మరిచి పట్టణ పరిశుభ్రత కోసం పరితపించే పౌర కార్మికుల సేవలు వెలకట్టలేనివని పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ పేర్కొన్నారు. సోమవారం పౌర కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పౌర కార్మికులకు పక్కా ఇళ్లు నిర్మించడానికి తన తండ్రి హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు తన అధికార హయాంలో పూర్తీచేసి వారికి అన్ని విధాలా అండగా ఉంటానని తెలిపారు. పూర్వ కార్మికులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా సంబంధిత అధికారులు స్పందించాలని లేనిపక్షంలో తన దృష్టికి తీసుకొస్తే అన్ని విధాలా సహాయపడతానని తెలిపారు. పౌర కార్మికులు ప్రతి నిత్యం పట్టణ పరిశుభ్రత కోసం చేసే సేవా కార్యక్రమాలను కర్ణాటక రాష్ట్రంలోనే పావగడ నంబర్ వన్‌గా నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ అధ్యక్షుడు హెచ్ రాజేష్, ఉపాధ్యక్షులు గీత హనుమంతరాయప్ప, మాజీ అధ్యక్షుడు రామాంజినప్ప, మున్సిపల్ ముఖ్య అధికారి జాఫర్‌షరీఫ్, ఆరోగ్య అధికారి శంషుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ


గోరంట్ల, సెప్టెంబరు 23: పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను రాష్ట్ర గిరిజన కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ సోమవారం సందర్శించారు. పాఠశాలలోని వసతి, సదుపాయాలను ఆరా తీశారు. తన కార్యక్రమం తెలిసికూడా రాలేదని తహసీల్దార్ రెడ్డిశేఖర్‌కు ఫోన్ చేసి మెమో జారీ చేస్తామని హెచ్చరించారు. పాఠశాలలో తరగతి గదులు చాలవని, ఇక్కడే చదువుకుని, ఇక్కడ నిద్రిస్తున్నామని బాలికలు తెలిపారు. సోషియల్, సామాన్య శాస్త్రం ఉపాధ్యాయులు లేరని, వంట మనిషి మినహా వర్కర్లు, స్వీపర్లు, రాత్రి వాచ్‌మెన్లులేరన్నారు. సమస్యలను పూర్తిగా గుర్తించామని, తమ నివేదికను ప్రభుత్వానికి అందచేస్తామని చెప్పారు. ఆయనతోపాటు డీటీ డబ్ల్యు మోహన్‌రామ్, గిరిజన ప్రజాసమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జుననాయక్, ఎంఇఓ గోపాల్, సీఎస్‌డీటీ శ్రీధర్, ఆర్ఐ సోముశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపల్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బీజేపీ సభ్యత్వ నమోదు

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 23: మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోంది. సోమవారం కాలువపల్లి గార్మెంట్స్ వద్ద మండల బీజేపీ సభ్యత్వ అధ్యక్షుడు పరిగి వేణుగోపాల్‌రావు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. టెక్స్‌పోర్ట్ గార్మెంట్స్‌లో పనిచేస్తున్న 60మందిదాకా సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిక్షణతో మహిళలకు ఉపాధి

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 23 : శిక్షణతో మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ డాక్టర్ గోపినాథ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత బ్యూటీషియన్, పార్లర్ మేనేజ్‌మెంట్‌పై సోమవారం శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో శేఖర్ మాట్లాడుతూ మహిళలు సాధికారత కోసం వారి నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ శిక్షణలు దోహదపడతాయన్నారు. ప్రతి మహిళా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామక్రిష్ణ, రామాంజనేయులు, హరీష్, రవి, సోము, హనుమంతు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం శేఖర్

సబ్సిడీ విత్తనాల పంపిణీ

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 23 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు సకాలంలో సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తున్నారని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చిన్నవెంకటరాముడు తెలిపారు. సోమవారం మండలంలోని మునిమడుగు గ్రామంలో ఆర్బీకే కేంద్రంలో రైతులకు సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లారీ, ద్విచక్రవాహనం ఢీ.. మహిళ మృతి

గోరంట్ల, సెప్టెంబరు 23: పట్టణంలోని పాత పోస్టాఫీస్ క్రాస్‌లో సోమవారం లారీ, ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో వేదవతి (49) అనే మహిళ మృతి చెందారు. చిలమత్తూరు పంచాయతీ కార్యాలయంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న మల్లికార్జున గోరంట్లలో నివాసముంటున్నారు. సమీప బంధువు మృతిచెందినట్లు తెలియడంతో మల్లికార్జున, వేదవతి దంపతులు చెర్లోపల్లికి బయలు దేరారు. గోరంట్లలోని పాత పోస్టాఫీస్ వద్ద ఎదురుగా వస్తున్న లారీని, క్రాస్ చేసే సమయంలో ఇరుకుగా ఉండడంతో ప్రమాదం జరిగింది. చిలమత్తూరుకు చెందిన లారీ ఎరువుల లోడు తీసుకురావడానికి వెళుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో వేదవతి అక్కడికక్కడే మృతి చెందగా భర్త సురక్షితంగా బయటపడ్డారు. కళ్లముందే భార్య మృతిచెందడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సీఐ శేఖర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ దొంగకు దేహశుద్ధి

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 23: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సెల్‌ఫోన్ దొంగకు ప్రజలు దేహశుద్ధి చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఓ వ్యక్తి నుంచి మొబైల్ దొంగతనం చేస్తూ పరుగులు తీస్తున్న యువకుడిని ఆటోలో వెంబడించి పట్టుకున్నారు. ఈ క్రమంలో అతడిని చితక్కొట్టి పోలీసులకు అప్పగించారు. ఈ విషయంపై ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ... అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం

మడకశిర రూరల్, సెప్టెంబరు 23 : మండలంలోని వైబీహళ్లికి చెందిన మోహన్ మెడిసిన్‌లో మంచి ర్యాంక్ రావడంతో కర్నూలు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సంపాదించాడు. పేద కుటుంబానికి చెందిన మోహన్ ఫీజు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో విద్యార్థి సోమవారం మండలంలోని బుళ్లసముద్రం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్‌ను కలిసి తన బాధను వివరించాడు. ఆయన వెంటనే దుబాయ్‌లో ఉన్న తన స్నేహితుడు వైబీహళ్లికి చెందిన జనార్దన్‌రెడ్డిని సంప్రదించారు. వెంటనే ఆ విద్యార్థి ఫీజు కోసం ఫోన్ పే ద్వారా రూ.25 వేలు ఆర్థికసాయం అందించారు. ఆ మొత్తాన్ని హెచ్ఎం విద్యార్థికి అందజేశారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కూడా విద్యార్థికి స్టడీమెటీరియల్ అందించనున్నట్లు తెలిపారు.

పట్టాలు మంజూరు చేయండి

పెనుకొండ, సెప్టెంబరు 23: ఇళ్లులేని నిరుపేదలందరికీ సర్వేనంబరు 668లో పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం సాయంత్రం తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిని అందిస్తూ గత సంవత్సరం ఇళ్లులేని నిరుపేదలకు సర్వేనంబరు 668లో కొట్టాలు వేసుకుని జీవనం సాగిస్తుండేవారన్నారు. రెవెన్యూ, పోలీస్‌శాఖలు బలవంతంగా కొట్టాలు కూల్చివేసి ఖాళీ చేయించారన్నారు. తాము కోర్టును ఆశ్రయించగా తమకు అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. రెవెన్యూ అధికారులు తమకు న్యాయం చేయలేదన్నారు. తహసీల్దార్ స్పందిస్తూ 15రోజుల్లో పట్టాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నారాయణ, వెంకటరాముడు, షబానా, షైలార, నాగమ్మ, పేదలు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం ధర్నా

గోరంట్ల, సెప్టెంబరు 23: ఇంటి స్థలాలు మంజూరు చేయాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో పవర్‌లూమ్స్ కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. కొంతకాలంగా పవర్‌లూమ్స్ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అధికారులను కోరినా పట్టించుకోలేదన్నారు. తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతి పత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీరాములు, జయలక్ష్మమ్మ, కళావతి, సుకన్య, గీతా, సుశీలమ్మ, చాంద్‌బాషా, కార్మిక నాయకులు రామక్రిష్ణ, వెంకటేష్, బాబు, మహేష్, శంకర్, మనోహర్ పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి రథోత్సవం



నృత్యం చేస్తున్న చిన్నారులు

పుట్టపర్తి సెప్టెంబరు 23: శ్రీకాకుళం భక్తులు సత్యసాయి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణ వీధుల్లో సత్యసాయిరథాన్ని లాగుతూ సంగీతం, భక్తులను అలరింపజేశారు. మొదట సత్యమ్మ గుడి వద్ద సత్యసాయి రథానికి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. రథం ముందర రాధాకృష్ణులు, గోపికలతో చిన్నారులు నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. కోలాటం, భక్తి పాటలతో సత్యసాయి రథోత్సవం సాగింది. సత్యసాయి నామంతో పుట్టపర్తి వీధులు పులకించాయి. మూడువేల మంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సాయికుల్వంత్ మందిరానికి వెళ్లి సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

చినుకుపడితే చిత్తడే..

అధ్వానంగా మారిన రోడ్లు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

చిలమత్తూరు, సెప్టెంబరు 23: ప్రభుత్వాలు మారినా ప్రజల తలరాతలు మాత్రం మారలేదనడానికి ఈ బురదమయమైన రోడ్లు చూస్తే తెలుస్తోంది. గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలు అనే మాట చెప్పడానికే సరిపోతోంది కానీ, వాటిని పట్టుకొమ్మలుగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వాలు విఫలమవుతూనే ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో చిలమత్తూరు మండలంలో పలు గ్రామాలకు సరైన రోడ్డు మార్గాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదొర్కొన్నారు. పల్లెల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా మారింది. దీనికి నిదర్శనం కోడూరు నుంచి మధురేపల్లి, మధురేపల్లి నుంచి కందూరుపర్తి, గోరంట్ల-కొడికొండ రోడ్డు నుంచి ఎస్.ముద్దురెడ్డిపల్లికి, కోట్లోపల్లి నుంచి కొడికొండ చెక్‌పోస్టుకి ఉన్న రహదారులే. ఈ రహదారులు చిన్నపాటి వర్షానికే చిత్తడై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. మట్టి రోడ్లు కావడంతో అవి పూర్తీగా బురదగుంతలుగా మారిపోయాయి. కందూరుపర్తి గ్రామ ప్రజలు కోడూరు తోపు 44వ జాతీయ రహదారిలోకి రావాలంటే మదురేపల్లి మీదుగా సుమారు. 5 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంది. ఈ రహదారి చిన్నపాటి వర్షానికి బురదమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. అదేవిధంగా ఎస్.ముద్దిరెడ్డిపల్లి గ్రామ రోడ్డు కూడా ప్రయాణానికి ప్రమాదకరంగా మారింది. కోట్లోపల్లి దారి గుంతలుగా మారి ప్రయాణాలకు అసౌకర్యంగా మారింది. ఈ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రాకపోకలకు వీలులేకుండా పోయిన ఎస్.ముద్దిరెడ్డిపల్లి రోడ్డు

నేడు హిందూ సంఘాల ఐక్యవేదిక ర్యాలీ

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 23: తిరుమల లడ్డూ ప్రసాదానికి అపచారం చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ర్యాలీ చేపడుతున్నట్లు హిందూ సంఘాల ఐక్యవేదిక నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు చిన్నమార్కెట్ సర్కిల్ వేణుగోపాలస్వామి దేవాలయం వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రతి హిందువు పాల్గొని ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు.

ట్రాన్స్‌కో ఏఈగా పరమేశ్వర్ రెడ్డి

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 23: సోమందేపల్లి ట్రాన్స్‌కో ఏఈగా పరమేశ్వర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ సంజీవప్ప పరిగికి బదిలీ కాగా ఆయన స్థానంలో పరమేశ్వర్‌రెడ్డి వచ్చారు. స్థానిక సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధినిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తానని అన్నారు.

ఆర్టీసీ బస్టాండు పునఃప్రారంభానికి చర్యలు

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 23 : సోమందేపల్లిలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పక్కన 25సంవత్సరాల క్రితం నిర్మించిన ఆర్టీసీ బస్టాండు పునఃప్రారంభానికి అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం బస్టాండు ఆవరణంలో పెరిగిన పిచ్చిమొక్కలు, కంపచెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. బస్టాండు లోపల గదులను, ప్రయాణికులు కూర్చునే ప్రదేశాన్ని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా శుభ్రం చేస్తున్నామన్నారు. త్వరలో బస్టాండును పునఃప్రారంభిస్తామన్నారు. విచారణ విభాగాన్ని ఏర్పాటు చేసి బస్సులు బస్టాండు ఆగేలా చూస్తామన్నారు. మండల కేంద్రంలోని వివేకానందనగర్, దుర్గానగర్‌లో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు.



ఆర్టీసీ ఆవరణలో శుభ్రం చేస్తున్న దృశ్యం